ప్రజాశక్తి

శుక్రవారం 6 సెప్టెంబర్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

వరద బాధితులకు

రూ.కోటి ప్రత్యక్ష సాయం

- విజయవాడ, బాపట్ల, రేపల్లె వంటి ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, నీరు, పాలు అందజేత..
- నాలుగు రోజులుగా పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మరోసారి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. భారీ వరదల కారణంగా ఇబ్బంది పడుతున్న ప్రజలకు తన వంతు సాయం అందించారు. విజయవాడ, బాపట్ల, రేపల్లె వంటి ప్రాంతాల్లో సాయం కోసం ఎదురుచూస్తున్న వరద బాధితుల కోసం సుమారు కోటి రూపాయలకు పైగా ప్రత్యక్ష సాయాన్ని అందించారు. వరద బాధితుల అండగా నిలబడేందుకు తొలి రోజు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు అద్దంకి నియోజకవర్గం నుంచి ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, పాలను అందించారు. తొలి రోజు సుమారు 40 వేలకు పైగా ఆహార ప్యాకెట్లను, వాటర్ బాటిళ్లను విజయవాడలోని సింగ్‌నగర్ చుట్టు పక్కల ప్రాంతాల్లో పంపిణీ చేశారు. అదే రోజు మరో 25 వేల వాటర్ బాటిళ్లను బాధితుల కోసం పంపించారు. రెండో రోజూ కూడా అరవై వేల ఆహార ప్యాకెట్లను, వాటర్ బాటిళ్లను విజయవాడలోని రాజరాజేశ్వరి నగర్, సింగ్ నగర్ ప్రాంతాలతో పాటు సొంత జిల్లా బాపట్లలోని పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు పంపిణీ చేశారు. మూడో రోజు వరదల్లో చిక్కుకున్న చిన్నపిల్లలు, వద్ధుల కోసం 15 వేల పాల ప్యాకెట్లు, 30 వేల వాటర్ బాటిళ్లను సేకరించి విజయవాడలోని ఓల్డ్ రాజరాజేశ్వరి పేటకు పంపించారు.

మంత్రి గొట్టిపాటి

బాపట్ల జిల్లాలోని లంక గ్రామాలకు కూడా పాల ప్యాకెట్లతో పాటు వాటర్ బాటిళ్లను అందించారు. నాలుగో రోజు గొల్లపూడి, సింగ్ నగర్, వైఎస్ఆర్ కాలనీలోని వరద బాధితులకు పాల ప్యాకెట్లతో పాటు, మంచి నీటి బాటిళ్లను అందించారు. మొత్తంగా గడిచిన నాలుగు రోజులుగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ వరద బాధితుల కోసం కోటి రూపాయల మేరకు తక్షణ సాయాన్ని అందించారు. విజయవాడ, బాపట్ల లోని వివిధ ప్రాంతాల్లో వరద బాధితులకు తాను చేయదగిన సాయం అందించినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఒకవైపు బాపట్లలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూనే తన అనుచరుల సాయంతో బాధితులకు ఎప్పటికప్పుడు ఆహారం, నీరు, పాలు అందించగలిగినట్లు పేర్కొన్నారు. వరద బాధితులకు సాయం చేసేందుకు దాతలు, కంపెనీలు ముందుకు రావాలని కోరారు.

కన్నీరే మిగిలింది..!

- జిల్లాలో 86 వేల ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- 1279 ఎకరాల్లో ఉద్యానవన పంటలకు నష్టం
- వరి రైతులకు కోలుకోలేని దెబ్బ
- పంట నష్టం అంచనాలకు అధికార యంత్రాంగం సన్నద్ధం
- సాధారణ స్థితికి చేరుకుంటున్న లంక గ్రామాలు

కొల్లూరు మండలంలో వరదనీటిలోనే పసుపు పంట

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వరద ప్రభావం అన్నదాతలకు కన్నీరే మిగిల్చింది. వరద నీటి కారణంగా బాపట్ల జిల్లాలోని అన్ని పంటలకూ తీవ్రనష్టం వాటిల్లింది. పంటలు గడిచిన ఐదు రోజులుగా నీటిలోనే ఉండిపోయాయి. వరి పైరుకు తీవ్ర-నష్టం వాటిల్లింది. ఉద్యానవన పంటలు వరదనీటిలోనే ఉండి పోయి ఉరకలెత్తుతున్నాయి. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో రైతుల ప్రధాన సాగుగా ఉన్న అరటి, పసుపు, కంద, తమలపాకుల తోటలకు నష్టం వాటిల్లింది. లోతట్టు ప్రాంతాల్లోని వరి పైరు చాలా రోజులుగా నీటిలో ఉండిపోవడంతో నష్టం తప్పదని రైతులు భావిస్తున్నారు. వరద నీరు తగ్గడంతో లంక గ్రామాలన్నీ సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి.

86 వేల ఎకరాల్లో..

జిల్లాలో 86 వేల ఎకరాల్లో పంటలన్నీ వరద నీటిలోనే ఉన్నాయి. 1279 ఎకరాల్లో ఉద్యానవన పంటలు వరదనీటిలోనే ఉండి పోయి ఉరకలెత్తుతున్నాయి. వరద ప్రవాహం కారణంగా వేలాది ఎకరాల్లో వరిపైరుకు నష్టం వాటిల్లింది. వరదనీరు వెళ్లాక ఇప్పుడు మరలా దుక్కులు దున్ని వరిసాగు చేయాలంటే ఎక్కడా నారు దొరకని పరిస్థితి ఉంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వరద తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో వ్యవసాయాధికారులు పంట నష్టం అంచనాలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వరద ప్రవాహంతో దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యానవన పంటల సర్వే కోసం 161 మంది వ్యవసాయ సహాయకులు సర్వేలో పాల్గొంటున్నారు. పంటల నష్టంపై నిర్వహించే సర్వే ఈ నెల 10వ తేదీ లోగా పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని అధికారులు నిర్ధేశించారు. 11వ తేదీన సామాజిక తనిఖీలో భాగంగా రైతుల నుంచి అభ్యంతరాల స్వీకరణ చేపట్టనున్నారు.

తేరుకుంటున్న లంక గ్రామాలు

ప్రకాశం బ్యారేజి వద్ద నుంచి దిగువకు కష్ణానదీ ప్రవాహం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. వరద ప్రవాహానికి గుర్రపుడెక్క, చిల్లకంపతో నిండిపోయిన అరవింద వారధిని బాగుచేయడంతో లంకగ్రామాలకు రహదారి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో 22 లంక ▶ 3లో

భావి భారత పౌరుల్ని

తీర్చిదిద్దే బాధ్యత గురువులదే..

- ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన సర్వేపల్లి
- జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- ఘనంగా గురు పూజోత్సవం

అవార్డులతో ఉత్తమ ఉపాధ్యాయులు..

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉత్తమమైన వ్యక్తిని తయారు చేయడమే విద్య పరమార్థమని, భావి భారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో గురువారం జరిగిన గురు పూజోత్సవ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్, కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి, డిఇఒ డి.సుభద్రత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఉపాధ్యాయ వత్తికే వన్నె తెచ్చిన ఉత్తమ అధ్యాపకులు, భారత తొలి ఉప రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినతేదీని ఉపాధ్యాయ దినోత్సవంగా దేశం జరుపుకుంటుందన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులను సత్కరించి గౌరవించడమే గురు పూజోత్సవం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రపంచంలో ఎన్ని వృత్తులు ఉన్నా, ఉత్తమ వ్యక్తులను తయారు చేసే వత్తి ఉపాధ్యాయ వత్తి ఒక్కటేనని తెలిపారు. దీంతో టీచర్లంటే నాకెంతో గౌరవమన్నారు. విద్యపై ఉన్న ఆసక్తితోనే తాను, కుటుంబ సభ్యులు బివిఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూతను కొనసాగిస్తున్నామన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన 62 మంది ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మంచి సమాజాన్ని స్థాపించడానికి మీ వంతు కృషి చేయాలని కోరారు.

సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బూచేపల్లి, కలెక్టర్

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. విద్య ద్వారా ప్రతి ఒక్కరు ఉన్నత స్థానాలకు చేరుకోవడం వెనుక ▶ 3లో

సర్టిఫికెట్లు తెచ్చుకుందామని వెళ్లి..

భోపాల్‌లో ఊళ్లపాలెం యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

సర్టిఫికెట్లు తెచ్చుకుందామని తాను చదువుకున్న భోపాల్‌కు వెళ్లిన యువకుడు విగతజీవిగా మారడంతో ఆ తల్లిదండ్రులు తల్లిడిల్లిపోతున్నారు. అక్కడ కళాశాల నిర్వాహకులు యువకుడిది ఆత్మహత్య అని చెప్పగా.. యువకుడి ఒంటి మీద గాయాలని బట్టి.. ఇది హత్య అని తల్లిదండ్రులు భావిస్తున్నారు.

శశిధర్ (ఫైల్)

శింగరాయకొండ మండలం, ఊళ్ళపాలెం గ్రామానికి చెందిన రేణుమాల శశిధర్(23) మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో ఎన్ఐటి కళాశాలలో ఎంటెక్ పూర్తి చేశారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సంవత్సరానికి రూ.40 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం కూడా సాధించాడు. గత నెల 25న సర్టిఫికెట్లు తీసుకొచ్చుకునేందుకు భూపాల్ వెళ్లాడు. ఈ నేపథ్యంలో మంగళ వారం నాడు ఊళ్లపాలెం గ్రామంలో ఉంటున్న తల్లిదండ్రులు పున్నయ్య, ఏసమ్మకు కళాశాల నుంచి ఫోన్ వచ్చింది. మీ కుమారుడు శశిధర్ ఆత్మహత్య చేసుకొని చనిపోయాడని చెప్పడంతో తల్లిదండ్రులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అయితే అక్కడ తల్లిదండ్రుల విచారించగా కళాశాల వద్ద ఆత్మహత్య చేసుకున్నాడని చెబుతున్నారని, అదే విషయం కళాశాల సిబ్బంది పోలీస్ స్టేషన్లో కూడా చెప్పారని. అయితే కుమారుడు ఒంటి మీద గాయాలు ఉండడంతో భోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఆత్మహత్య కాదని, ఇది హత్య అని అక్కడ పోలీసులకు చెప్పినా పూర్తి స్థాయిలో స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న తమకు కుమారుడు అండగా ఉంటాడని.. దూర ప్రాంతంలో చదివిస్తే.. చివరకు విగతజీవిగా మారాడని తల్లిదండ్రులు తలడిల్లిపోతున్నారు. గురువారం సాయంత్రం మతదేహాన్ని శింగరాయకొండకు తీసుకొచ్చారు. అక్కడ జరిగిన విషయాన్ని శింగగరాయకొండ ఎస్సై ఎం మహేంద్రకు వివరించారు. అక్కడ ఆత్మహత్య కింద కేసు నమోదు చేశారని, తమ కుమారుడు ఒంటి మీద గాయాలు ఉండటం చూస్తుంటే ఇది హత్యగా ఉందని శింగరాయకొండ పోలీసులకు వివరించారు. ఈ విషయాన్ని అక్కడ పోలీసులతో మాట్లాడి న్యాయం జరిగే విధంగా చూస్తానని ఎస్ఐ హామీ ఇచ్చారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని అంకమ్మ గూడెం, హనుమంతుని చెంచుగూడెంలో గురువారం వెంకటాద్రిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.కోటా నాయక్, డాక్టర్ సయ్యద్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 126 మందికి చికిత్సలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

నోటీసు
మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A NO: 274/2023 IN O. S NO: 9/2011
Between:
కాకాని పెదరంగారావు ...పిటీషనర్ /వాది
Vs
గుమ్మళ్ళ రామయ్య మరియు 13మంది
... రెస్పాండెంట్లు/ ప్రతివాదులు
1 to 3/ ప్రపోజ్డ్ రెస్పాండెంట్స్ 4 to 11/ సప్లమెంటల్ డిఫెన్ డెంట్స్ 12 to 14
TO
R14: వెల్మూరి తులశి W/o చైతన్య కుమార్, R/o గోపాల స్వామి దేవాలయ సమీపము, కారంచేడు గ్రామం, పోస్టు, మండలం, బాపట్ల జిల్లా.

పై నంబరు పిటీషన్ లో పిటిషనర్ / వాది మిమ్ములను పై నంబరు దావాలో సప్లమెంటల్ డిఫెండెంట్ నంబరు 14 గా చేర్చమని కోరుతూ Order 1 Rule 10 మరియు Sec 151 CPC ప్రకారం పై కోర్టులో దాఖలు చేసిన పిటిషనులో మీకు కోర్టు వారి నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయవలసినదిగా కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. ఇందు నిమిత్తమై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తేది: 30-9-2024 ఉదయం 10.30 ని॥ లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ, వకీల్ ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందు మూలకముగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి అనుమతితో//

అద్దంకి
05.9.24
ఇట్లు
పంచాగ్నుల రమేష్, అడ్వకేట్
అద్దంకి,బాపట్ల జిల్లా.
సెల్ నెం 99487 88290

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 567/2022
బ్యాంక్ ఆఫ్ బరోడా (విజయ బ్యాంక్)
రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచి మేనేజర్,
బేస్తవారిపేట బ్రాంచి ...వాది
వర్సస్
1) గంగారాపు లక్ష్మీ
2) తోట ఈశ్వరయ్య ...ప్రతివాదులు
To
2వ ప్రతివాది చిరునామా:
తోట ఈశ్వరయ్య తండ్రి పాపయ్య,
వయస్సు సుమారు 42 సంవత్సరాలు, హిందూ,
నివాసం : గొల్లపూడి, క్రిష్ణా జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.

పై నెంబర్ దావాలోని వాది నీ నుండి దావా ప్లయింటు పరిహారం రాగోరి మీపై దావాను దాఖలు చేసి యున్నారు. సదరు దావాలో నీకేమైనా ఆక్షేపణలు వున్న యెడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేదీ 01-10-2024 న ఉదయం గం. 10:30ని. లకు స్వయంగా గాని, లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై, నీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో నీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు
తేదీ : 05-09-2024
ఇట్లు
శ్రీ పురాణం సుబ్రహ్మణ్యం,
శ్రీ తురగా ఈశ్వర అంజనీ కుమార్
వాదిపరం అడ్వకేట్స్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా,
ఆంధ్రప్రదేశ్.

విరాళాలు సేకరణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విజయవాడ వరద బాధితుల కోసం ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో గురువారం విరాళాల సేకరణ చేపట్టారు.

శ్రీయుత ఫ్యామిలీ జడ్జి వారి కోర్టులో ఒంగోలు
MC OP : 51/2023
Between
షేక్ జబీనా ....పిటీషనర్
మరియు
షేక్ అక్బర్ ....రెస్పాండెంట్
To
షేక్ అక్బర్ తండ్రి సుల్తాన్ బాషా,
42 సంవత్సరాలు, బలరాం కాలనీ,
నియర్ వృద్ధుల ఆశ్రమం, ఒంగోలు, ప్రకాశం జిల్లా.

మీ నుండి భరణము కోరుతూ పిటిషనరు దాఖలు చేసిన MC OP: 51/2023 నందు శ్రీయుత న్యాయస్థానం వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు ఏదో ఒక కారణంతో తిప్పి పంపుచున్నారు కావున తేది 15-09-2024 న ఉదయం 10:30కి మీరు శ్రీయుత కుటుంబ న్యాయస్థానం ఒంగోలు వారి ఎదుట హాజరు కావలసి ఉన్నది లేనియెడల మీ పరోక్షమున పై కేసు తీర్మానించబడునని తెలుసుకునేది

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

ఒంగోలు
తేది: 02-09-2014
ఇట్లు
పిటిషనర్ తరపు న్యాయవాదులు
ధారా వెంకటేశ్వర వశిష్ట
నూతలపాటి ఇన్నయ్య బాబు
దార్నాసి హరిబాబు
రూము నెంబర్ 4 బి బ్లాక్ కోర్టు కాంప్లెక్స్
న్యాయవాద సదన్, ఒంగోలు, ప్రకాశం జిల్లా

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 1194/2023
IN
O.S.No. 635/2021
బ్యాంక్ ఆఫ్ బరోడా e-విజయ బ్యాంక్
Represented by its బ్రాంచి మేనేజర్,
బేస్తవారిపేట బ్రాంచి ...పిటిషనరు / వాది
వర్సస్
M/s వెంకటేశ్వర క్లాత్ స్టోర్స్, Rep.by its ప్రొప్రయిటర్ బాదం సత్యనారాయణ చనిపోతే ఆయన వారసులు బాదం మల్లేశ్వరి మరియొకరు
...రెస్పాండెంట్లు 1and 2/ ప్రతివాదులు
...(Proposed D3 and D4)
To,
R1/proposed D3:
బాదం మల్లేశ్వరి భర్త లేట్ సత్యనారాయణ,
వయస్సు 30 సంవత్సరాలు, తేరు బజారు,
మార్కాపురం టౌన్, మార్కాపురం మండలం,
ప్రకాశం జిల్లా.
R2/proposed D4:
బాదం వరుణ్ తండ్రి లేట్ సత్యనారాయణ,
వయస్సు 4 సంవత్సరాలు, మైనర్,
Represented by his mother బాదం మల్లేశ్వరి,
వయస్సు 30 సంవత్సరాలు, తేరు బజారు,
మార్కాపురం టౌన్, మార్కాపురం మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ పిటిషన్ లోని పిటిషనరు/ వాది 1వ ప్రతివాది బాదం సత్యనారాయణ చనిపోతే ఆయన వారసులుగా మిమ్ములను చేర్చగోరుచూ వారసుల పిటిషన్ (LRs petition) దాఖలు చేసినందున, సదరు పిటిషన్ లో మీరు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా తేదీ 15-10-2024న ఉన్నది. మీరు వాయిదా రోజు ఉదయం గం 10:30 ని.లకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పైకోర్టులో హాజరై, మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు సదరు పిటిషన్ ను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు
తేదీ : 05-09-2024
ఇట్లు
శ్రీ పురాణం సుబ్రహ్మణ్యం,
శ్రీ తురగా ఈశ్వర అంజనీ కుమార్,
పిటిషనర్స్ / వాదిపరం అడ్వకేట్స్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా,
ఆంధ్రప్రదేశ్.

KANAKADURGA
FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : Opp.చుండూరు పెట్రోల్ బంక్, అద్దంకి బస్టాండ్, ఒంగోలు.
- బంగ్లారోడ్డు, భాష్యం స్కూల్ దగ్గర, అద్దంకి-523201
-#6/97&98, వార్డు నెం.6, ఎన్టీఆర్ విగ్రహం, నాయుడు వీధి, దోర్నాల బస్టాప్ వద్ద, మార్కాపురం. ఫోన్ : 9492934845
- D.no:2-14-26, Near Chatrapati Sivaji Statue, Devi Theater Road, Kavali -524201, PH No: 9573111796
-S. V. Gopal Reddy complex , YSR Road, Kanigiri – 523230.
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-09-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 764.91 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు D.No:37-1-175(2), Opp: CHUNDURI PETROL BUNK, Aadanki Bus Stand, Ongole, AP-523001 నందు వేలం వేయ బడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
D.No:37-1-175(2), Opp: CHUNDURI PETROL BUNK, Aadanki Bus Stand, Ongole , AP- 523001 CONTACT PERSON, AREA MANAGER, SIVA PRASAD-87124 44616

సర్టిఫికెట్లు పోయినవి

ఓరుగంటి వెంకట లక్ష్మిసాయి సునంద, తండ్రి: శివకుమార్ శర్మ అనే నేను ఆదివారం రాత్రి సమయంలో గుంటూరు నుంచి మార్కాపురం వస్తున్న సమయంలో బస్సులో నా బ్యాగ్ మిస్ అయినది. నా యొక్క డిగ్రీ సర్టిఫికెట్లు పోగొట్టుకున్నాను. ఎవరికైనా కనిపించిన యెడల 9494868251 సెల్ఫోన్ నెంబరుకు సమాచారం ఇవ్వగలరని మనవి.

ఇట్లు
ఓరుగంటి వెంకటలక్ష్మిసాయి సునంద
మార్కాపురం.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 1195/2023
IN
O.S.No. 635/2021
బ్యాంక్ ఆఫ్ బరోడా e-విజయ బ్యాంక్
Represented by its బ్రాంచి మేనేజర్,
బేస్తవారిపేట బ్రాంచి ...పిటిషనరు / వాది
వర్సస్
M/s వెంకటేశ్వర క్లాత్ స్టోర్స్, Rep.by its ప్రొప్రయిటర్ బాదం సత్యనారాయణ చనిపోతే ఆయన వారసులు బాదం మల్లేశ్వరి మరియొకరు
...రెస్పాండెంట్లు 1and 2/ ప్రతివాదులు
...(Proposed D3 and D4)
To,
R1/proposed D3:
బాదం మల్లేశ్వరి భర్త లేట్ సత్యనారాయణ,
వయస్సు 30 సంవత్సరాలు, తేరు బజారు,
మార్కాపురం టౌన్, మార్కాపురం మండలం,
ప్రకాశం జిల్లా.
R2/proposed D4: బాదం వరుణ్ తండ్రి లేట్ సత్యనారాయణ,
వయస్సు 4 సంవత్సరాలు, మైనర్,
Represented by his mother బాదం మల్లేశ్వరి,
వయస్సు 30 సంవత్సరాలు, తేరు బజారు,
మార్కాపురం టౌన్, మార్కాపురం మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబరు పిటిషన్ లోని పిటిషనరు / వాది, 1వ ప్రతివాది బాదం సత్యనారాయణ చనిపోతే ఆయన వారసులైన బాదం మల్లేశ్వరి, బాదం వరుణ్ లను దావాలో ప్రపోజుడు 3,4 ప్రతివాదులుగా చేర్చగోరుచూ పిటిషన్ దాఖలు చేసినందున, ప్రపోజుడు 4వ ప్రతివాది అయిన బాదం వరుణ్ మైనర్ అయినందున, బాదం వరుణ్ గార్డియన్ గా ప్రపోజుడు 3వ ప్రతివాది అయిన బాదం మల్లేశ్వరిని నియమించగోరుచూ గార్డియన్ పిటిషన్ దాఖలు చేసినందున, సదరు పిటిషన్ లో మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 15-10-2024వ తేదీ వున్నది. వాయిదా రోజు ఉదయం 10:30 ని.లకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు ఉంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు సదరు పిటిషన్ ను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు
తేదీ : 05-09-2024
ఇట్లు
శ్రీ పురాణం సుబ్రహ్మణ్యం,
శ్రీ తురగా ఈశ్వర అంజనీ కుమార్,
పిటిషనర్స్ / వాదిపరం అడ్వకేట్స్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా,
ఆంధ్రప్రదేశ్.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 1193/2023
IN
O.S.No. 635/2021
బ్యాంక్ ఆఫ్ బరోడా e-విజయ బ్యాంక్
Represented by its బ్రాంచి మేనేజర్,
బేస్తవారిపేట బ్రాంచి ...పిటిషనరు / వాది
వర్సస్
M/s వెంకటేశ్వర క్లాత్ స్టోర్స్,
Rep.by its ప్రొప్రయిటర్ బాదం సత్యనారాయణ చనిపోతే ఆయన వారసులు బాదం మల్లేశ్వరి మరియొకరు
రెస్పాండెంట్లు 1and 2/ ప్రతివాదులు
...(Proposed D3 and D4)
To
R1/proposed D3:
బాదం మల్లేశ్వరి, భర్త లేట్ సత్యనారాయణ,
వయస్సు 30 సంవత్సరాలు, తేరు బజారు,
మార్కాపురం టౌన్, మార్కాపురం మండలం,
ప్రకాశం జిల్లా.
R2/proposed D4:
బాదం వరుణ్, తండ్రి లేట్ సత్యనారాయణ,
వయస్సు 4 సంవత్సరాలు, మైనర్,
Represented by his mother బాదం మల్లేశ్వరి,
వయస్సు 30 సంవత్సరాలు, తేరు బజారు,
మార్కాపురం టౌన్, మార్కాపురం మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ పిటిషన్ లోని పిటిషనరు/ వాది 1వ ప్రతివాది బాదం సత్యనారాయణ చనిపోతే ఆయన వారసులుగా మిమ్ములను చేర్చగోరుచూ వారసుల పిటిషన్ (LRs petition) దాఖలు చేయుటలో జరిగిన 485 రోజుల ఆలస్యంను మన్నించగోరుచూ సెక్షన్ 5 లిమిటేషన్ యాక్టు పిటిషన్ ను దాఖలు చేసినందున, సదరు పిటిషన్ లో మీరు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా తేదీ 15-10-2024న ఉన్నది. మీరు వాయిదా రోజు ఉదయం గం 10:30 ని.లకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పైకోర్టులో హాజరై, మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు సదరు పిటిషన్ ను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు
తేదీ : 05-09-2024
ఇట్లు
శ్రీ పురాణం సుబ్రహ్మణ్యం,
శ్రీ తురగా ఈశ్వర అంజనీ కుమార్,
పిటిషనర్స్ / వాదిపరం అడ్వకేట్స్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా,
ఆంధ్రప్రదేశ్.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 1196/2023
IN
O.S.No. 635/2021
బ్యాంక్ ఆఫ్ బరోడా e-విజయ బ్యాంక్
Represented by its బ్రాంచి మేనేజర్,
బేస్తవారిపేట బ్రాంచి ...పిటిషనరు / వాది
వర్సస్
M/s వెంకటేశ్వర క్లాత్ స్టోర్స్, Rep.by its ప్రొప్రయిటర్ బాదం సత్యనారాయణ చనిపోతే ఆయన వారసులు బాదం మల్లేశ్వరి మరియొకరు
...రెస్పాండెంట్లు 1and 2/ ప్రతివాదులు
...(Proposed D3 and D4)
To
R1/proposed D3:
బాదం మల్లేశ్వరి భర్త లేట్ సత్యనారాయణ,
వయస్సు 30 సంవత్సరాలు, తేరు బజారు,
మార్కాపురం టౌన్, మార్కాపురం మండలం,
ప్రకాశం జిల్లా.
R2/proposed D4:
బాదం వరుణ్ తండ్రి లేట్ సత్యనారాయణ,
వయస్సు 4 సంవత్సరాలు, మైనర్,
Represented by his mother బాదం మల్లేశ్వరి,
వయస్సు 30 సంవత్సరాలు, తేరు బజారు,
మార్కాపురం టౌన్, మార్కాపురం మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ పిటిషన్ లోని పిటిషనరు/ వాది 1వ ప్రతివాది బాదం సత్యనారాయణ చనిపోతే ఆయన వారసులుగా మిమ్ములను చేర్చగోరుచూ వారసుల పిటిషన్ (LRs petition) దాఖలు చేయుటలో జరిగిన ఆలస్యం వలన జరిగిన దావా abatment ను setaside చేయగోరుచూ పిటిషన్ దాఖలు చేసినందున, సదరు పిటిషన్ లో మీరు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా తేదీ 15-10-2024న ఉన్నది. మీరు వాయిదా రోజు ఉదయం గం 10:30 ని.లకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పైకోర్టులో హాజరై, మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు సదరు పిటిషన్ ను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం : గిద్దలూరు
తేదీ : 05-09-2024
ఇట్లు
శ్రీ పురాణం సుబ్రహ్మణ్యం,
శ్రీ తురగా ఈశ్వర అంజనీ కుమార్,
పిటిషనర్స్ / వాదిపరం అడ్వకేట్స్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా,
ఆంధ్రప్రదేశ్.

టెండర్ ప్రకటన

ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, చదలవాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానమునకు సంబంధించి ఈ క్రింది తెలిపిన పనులకు గాను 5వ తరగతి రిజిస్టర్డ్ సివిల్ కాంట్రాక్టర్ల నుండి సీల్డు వేసిన టెండర్లు కోరబడుచున్నవి. సదరు పనులకు గాను తేది: 06-09-2024 ఉదయము 10.00 గంటల నుండి తేది: 18-09-2024 సాయంత్రము 5.00 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించబడును. టెండర్ షెడ్యూలు తేది: 19-09-2024 ఉదయము 10.00 గంటల నుండి తేది: 20-09-2024 సాయంత్రము 5.00 గంటల వరకు ఇవ్వబడును. టెండర్ దరఖాస్తుతో పాటు టెండర్ ధరావత్తును డిమాండ్ డ్రాఫ్టుతో గాని, నగదు చెల్లించిన రశీదు గాని జతపరచవలెను. సీల్డు కవర్లు తేది: 21-09-2024 ఉదయము 10.00 వరకు పై దేవస్థానము నందు స్వీకరించబడి అదే రోజు సాయంత్రం 4.00 గంటలకు శ్రీయుత జిల్లా దేవాదాయశాఖ అధికారి, దేవాదాయ-ధర్మాదాయ శాఖ, ఒంగోలు వారి కార్యాలయము నందు వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు తెరువబడును.

వ.నెం.	పని పేరు	అంచనా విలువ	టెండరు ధరావత్తు	టెండర్ షెడ్యూల్ ఖరీదు	పని పూర్తి చేయు కాలము
1.	దేవస్థానమునకు రంగులు వేయుట	Rs.2,00,000/-	Rs.2000/-	Rs.500/-	60 రోజులు

గమనిక: ఏ కారణము చేతనైనా కారణము తెలుపకుండా టెండర్లు తిరస్కరించు అధికారము కార్యనిర్వహణాధికారి వారికి కలదు.

ఇట్లు
కార్యనిర్వహణాధికారి
శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానము
చదలవాడ (గ్రామము), నాగులుప్పలపాడు (మండలం)
ప్రకాశం జిల్లా.

టెండరు ప్రకటన

ప్రకాశం జిల్లా, ఈ క్రింది నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలు గ్రామములో వేంచేసియున్న శ్రీ చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానములు యొక్క ఈ క్రింద తెల్పిన పనులకుగాను 5వ తరగతి రిజిస్టరు సివిల్ కాంట్రాక్టర్ల నుండి సీలు చేసిన టెండర్లు కోరబడుచున్నవి. సదరు పనులకుగాను తేది: 06-09-2024 ఉదయం 10-00 గంటల నుండి తేది: 18-09-2024 సాయంత్రం 5-00 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించబడును. టెండరు షెడ్యూలు తేది: 19-09-2024 ఉదయం 10-00 గంటలనుండి తేది: 20-09-2024 సాయంత్రం 5-00 గంటలవరకు ఇయ్యబడును. టెండరు దరఖాస్తుతోపాటు టెండరు ధరావత్తు డిమాండ్ డ్రాఫ్టుగాని నగదు చెల్లించిన రసీదుగాని జతపరచవలెను. సీల్డు కవర్లు తేది: 21-09-2024 ఉదయం 10 గంటలవరకు దేవస్థానము నందు స్వీకరించబడి అదే రోజు సాయంత్రం 4-00 గంటలకు శ్రీ సహాయ కమీషనర్, దేవాదాయశాఖ, ఒంగోలు వారి ఆఫీసునందు వారిచేగాని, వారి అనుమతి పొందిన వారిచేగాని టెండర్లు తెరువబడును.

వ.నెం	పని పేరు	అంచనా విలువ	టెండరు ధరావత్తు	టెండరు షెడ్యూలు ఖరీదు	పనిపూర్తి చేయు కాలము
1.	వంటశాల షెడ్డు నిర్మాణము నిర్మించుట కొరకు	రూ. 5,00,000/-	రూ. 5,000/-	రూ. 1000/-	6 నెలలు

గమనిక: ఏ కారణము చేతనైనా కారణము తెలుపకుండా టెండర్లు తిరస్కరించు అధికారము కార్యనిర్వహణాధికారికి కలదు.

ఇట్లు
వెలగం శ్రీనివాస్,
కార్యనిర్వహణాధికారి,
అమ్మనబ్రోలు గ్రామం, సెల్: **9640149199**

దేవాదాయశాఖ అధికారులపై దౌర్జన్యం

- హెచ్చరిక బోర్డులు తొలగింపు
- కేసు నమోదు చేసిన పోలీసులు

అధికారులతో వాగ్వివాదానికి దిగిని మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

దేవాదాయ శాఖ భూములకే ఎసురు పెట్టి ప్రశ్నించిన అధికారులపై దౌర్జన్యానికి పాల్పడిన గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మార్కాపురం మండలం నరసింహపురం గ్రామ ఇలాకాలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం సంబంధించిన భూములు ఉన్నాయి. ఆ భూములను మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకష్ణ, వైసిపి పట్టణ నాయకులు బొగ్గరపు శేషయ్య, దోగిపర్తి హరి ఆక్రమించారు. ఆక్రమిత భూముల్లో దేవాదాయ శాఖ మార్కాపురం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరావు , మార్కాపురం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ దేవస్థానం ఇఒ గొలమారి శ్రీనివాసరెడ్డి, సిబ్బందితో కలిసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖకు సంబంధించిన సర్వేనెంబర్ 1145-3, 1145-1డి, 1148, 1110-1, 1144-1, 1144-3, 1144-5,1144-6,1144-7 లోని ఎ 25.19 సెంట్ల భూములకు సంబంధించి హెచ్చరిక బోర్డులు బుధవారం ఏర్పాటు చేశారు.అయితే మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకష్ణ, వైసిపి బొగ్గరపు శేషయ్య, నాయకులు అక్కడికి చేరుకొని తమకు 99 సంవత్సరాలు లీజు ఉందంటూ హెచ్చరిక బోర్డులు తొలగించారు. దీంతో దేవాదాయ శాఖ అధికారులు ఈ విషయం గురించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్చరిక బోర్డులు వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్ఐ అంకమ్మరావు ఆధ్వర్యంలో దేవదాయశాఖ అధికారులు గురువారం మళ్లీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న దేవదాయ శాఖ అధికారులను వైసిపి నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని వారించి అధికారులతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.

ఆటోలో బియ్యం బస్తాలు తరలిస్తున్న నాయకులు

బియ్యం బస్తాలు తరలింపు

ప్రజాశక్తి - మద్దిపాడు

విజయవాడ వరద బాధితులకు సాయం అందించేందుకు మేమున్నామంటూ పలువురు ముందుకొస్తున్నారు. మద్దిపాడు మండలం లింగంగుంట ఎంపిటిసి కష్ణ, టిడిపి సీనియర్ నాయకులు నల్లూరి నరసింహారావు సహకారంతో గ్రామస్తులు 50 బస్తాలు బియ్యాన్ని వరద బాధితుల సహాయార్థం గురువారం తరలించారు. అదేవిధంగా మద్దిపాడు మండలం ఇనమనమెల్లూరు గ్రామంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో టిడిపి నాయకులు డొప్ప శేషయ్య, నైనాల భావనారాయణ సహకారంతో 100 బస్తాలు బియ్యం, సీతారామపురం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో గ్రామ పార్టీ అధ్యక్షులు మారెళ్ళ హరికుమార్, సర్పంచి మండవ శివానందరావు ఆధ్వర్యంలో 40 బస్తాల బియ్యాన్ని విజయవాడకు తరలించారు. మండల టిడిపి అధ్యక్షుడు జయంత్ బాబు ఆధ్వర్యంలో వరద బాధితులకు బియ్యం పంపిణీ చేస్తారు.

'శ్రీసాయి బాలాజీ' విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి-మార్కాపురం : వరదబాధితులకు సహాయార్థంగా మార్కాపురం పట్టణంలోని శ్రీసాయి బాలాజీ హైస్కూల్ విద్యార్థులు వితరణ చూపారు. విద్యార్థులందరూ కలిసి రూ. 22,500 నగదును సేకరించారు. ఈ మొత్తాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్‌కు ఆ పాఠశాల డైరెక్టర్ పి.ప్రకాశరావు, ప్రిన్సిపల్ మస్తాన్‌వలి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఇన్‌ఛార్జి కృష్ణవేణి, సుభాషిణి, పిఇటి సయ్యద్ వలి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న చిన్నారులు

ప్రజాశక్తి-కొండపి

ఆర్థికసాయం అందజేస్తున్న చిన్నారులు

కొండపి మండలం వెన్నూరు గ్రామానికి చెందిన చిన్నారులు మానవత్వం చాటుకున్నారు. పొలినేని వర్షిత్, రోహిత్ అనే చిన్నారులు తమ హుండీలో దాచుకున్న రూ.6,440 వరద బాధితుల సహాయార్థం అందజేశారు.గ్రామ సర్పంచి జి.సంధ్యారాణికి గురువారం ఈ నగదు అందజేశారు. వరద బాధితులకు సాయం అందజేసిన చిన్నారులను పలువురు అభినందించారు.

భావి భారత పౌరుల్ని తీర్చిదిద్దే బాధ్యత గురువులదే..

(మొదటిపేజీ తరువాయి)

గురువు కృషి దాగి ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు తోపాటు సంస్కారాన్ని అలవర్చి రేపటి పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యతను నిర్వర్తిస్తున్నారన్నారు. తనకు విద్యను అందించిన ఉపాధ్యాయులను ఈ సంధర్భంగా కలెక్టర్ గుర్తుచేసుకున్నారు. జీవితంలో వస్తున్న సమస్యలు, ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలనే నైపుణ్యాన్ని విద్యార్థులకు విద్యార్థి దశ నుండే బోధించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లాలో 72 శాతం మాత్రమే అక్షరాస్యత శాతం వుందని, అక్షరాస్యతా శాతాన్ని పెంపొందించాల్సిన భాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్న లక్ష్యంతో జిల్లాలో గత ఆగస్ట్ 1 నుంచి 31 తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 30 మంది పిల్లలను బడిలో చేర్పించామన్నారు. 0-18 వయస్సు గల పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో వుంచుకొని జిల్లాలో బంగారు బాల్యం అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.

ఉపాధ్యాయ వృత్తి నుండే వచ్చా..

తాను కూడా ఉపాధ్యాయ వృత్తి నుండే ఈ స్థాయికి వచ్చినట్లు ఒంగోలు మేయర్ గంగాడ సుజాత గుర్తు చేసుకున్నారు. తన శిష్యులు ఎదుగుదలనే గురుదక్షిణగా భావించే ఒకే వ్యక్తి ఉపాధ్యాయుడని, పిల్లలకు బుద్ధి, వికాసం, జ్ఞానం అనేవి వారి ద్వారానే సంక్రమిస్తాయన్నారు.

గురువు లేకపోతే సమాజం ఎదగలేదు
దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

గురువు లేకపోతే ఎవరూ సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగలేరని దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు చదువు తోపాటు సంస్కారాన్ని అలవర్చి రేపటి పౌరులుగా తీర్చిదిద్దుతున్న గురువులను సన్మానించు కోవడం తన అదష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులచే ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టు కున్నాయి. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 62 మందిని ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి డి. సుభద్ర, ఉప విద్యా శాఖాధికారి సుబ్బారావు, విద్యా శాఖ అధికారులు, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

కన్నీరే మిగిలింది.!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల రహదారులు బయటపడ్డాయి. కొల్లూరు మండలంలోని ముంపు గ్రామాలైన చిలుమూరు లంక, ఈపూరు లంక, సుగుణ లంక, పెద్దలంక, చింతల లంక, పెసరలంక, ఆవులు వారి పాలెం, గాజుల లంక, పోతర్లంక, కష్ణా నగరు, తోకలవారిపాలెం, తురకపాలెం, తిప్పలకట్ట, కిష్కింద పాలెం, తడికలపూడి, జువ్వలపాలెం, శ్రీరంగపురం, గుంటూరు గూడెం, కొత్తగూడెం ప్రాంతాలలో, బట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు, పల్లెపాలెం గ్రామాల్లోకి అధికారులు రోడ్డు మార్గంలో వెళ్లగలిగారు. అన్ని గ్రామాలకు ట్రాక్టర్లు వెళ్ళే వీలుండడంతో వాటి ద్వారానే లంకగ్రామాలకు ఆహారం, మంచినీరు అందిస్తున్నారు. నిత్యావసర సరకుల పంపిణీ చేపట్టారు. లంకల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు ప్రారభించారు. రహదారులు పునరుద్ధరణ కార్యక్రమాలు ప్రారంభించారు. లంక గ్రామాలలోని గహాలలోకి వరద నీటితో పాటు మట్టి, ఇసుక, చెత్త చేరిన క్రమంలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేశారు. పారిశుధ్య పనుల కోసం 350 మంది కార్మికులను విధుల్లోకి తీసుకున్నారు. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

శాంతి క్లినిక్ అధినేత

డాక్టర్ జయానంద ప్రకాష్ మృతి

డాక్టర్ జయానంద ప్రకాష్ (ఫైల్)

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలో శాంతి క్లినిక్ స్థాపించి ఈ ప్రాంత ప్రజలకు నాలుగున్నర దశాబ్దాల పాటు మెరుగైన వైద్య సేవలు అందించిన ప్రముఖ డాక్టర్ జయానంద ప్రకాష్ (75) గురువారం తెల్లవారు జామున స్వగృహంలో మృతి చెందారు. పేదల డాక్టర్‌గా జయానంద ప్రకాష్‌కు పేరు గడించారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) రాష్ట్ర నాయకుడు డాక్టర్ మాధినేని మాధవరావు, పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కె.వంశీకష్ణ, డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, పలువురు వైద్యులు ఉన్నారు. ఎపి రాష్ట్ర ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఎ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల అధినేత డాక్టర్ ఎం.షంషీర్‌అలిబేగ్ జయానంద ప్రకాష్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.

రైలు కిందపడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- రాచర్ల : రైలు కింద పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన రాచర్ల మండలం సత్యవోలు వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాచర్ల మండలం సత్యవోలు గ్రామానికి చెందిన పెద్ద పోలయ్య (81) గురువారం సత్యవోలు సమీపంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడు పెద్ద పోలయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని భావిస్తున్నారు. గిద్దలూరు ఆర్‌పిఎఫ్ ఎస్ఐ కె.పిచ్చిరెడ్డి, కానిస్టేబుల్ శేషయ్య, నంద్యాల జిఆర్‌పి హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్, బాల కాశయ్య స్థలాన్ని పరిశీలించారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి కట్టావారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 1,321 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,126 బేళ్లుఅమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 195 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అ త్యధిక ధర రూ.358, అత్యల్ప ధర రూ.190, సరాసరి ధర రూ.299 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ.
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్,
ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001.
E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు / కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు : 1) మెస్సర్స్ రాజ్యలక్ష్మి కాటన్ ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ప్రొప్రయిటర్ : శ్రీమతి ఉప్పు రాజ్యలక్ష్మి, ఫ్లాట్ నెం. 14, రామమూర్తి అపార్ట్‌మెంట్స్, 7వ లైను, బృందావన్ గార్డెన్స్, గుంటూరు. **1) శ్రీ ఉప్పు సత్యనారాయణ,** తండ్రి : లక్ష్మయ్య, ఫ్లాట్ నెం. 104, పంచవటి అపార్ట్‌మెంట్స్, సంగడిగుంట, గుంటూరు. **5) శ్రీ ఉప్పు శంకరరావు,** తండ్రి : ఉప్పు లక్ష్మయ్య, ఫ్లాట్ నెం. 14, రామమూర్తి అపార్ట్‌మెంట్స్, 7వ లైను, బృందావన్ గార్డెన్స్, పట్టాభిపురం, గుంటూరు-522005. **3) శ్రీమతి రాయని విజయలక్ష్మి,** భర్త : లేటు ఆర్ కోటేశ్వరరావు, బ్యాంక్ కాలనీ, కొత్తపేట, వేటపాలెం మండలం, ప్రకాశం జిల్లా, **4) శ్రీ కోల ఆదినారాయణ,** తండ్రి : బలరామయ్య, పందిళ్ళపల్లి గ్రామం, వేటపాలెం మండలం, ప్రకాశం జిల్లా.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.ఆర్.బి. బ్రాంచి వారికి మెస్సర్స్ రాజ్యలక్ష్మి కాటన్ ట్రేడర్స్ కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 14-05-2019** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 05-09-2019** న అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 14-05-2019** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

ఆస్తి నెం. 1 : గుంటూరు, కొత్త కాలనీ దగ్గర, కొత్త గుంటూరు మున్సిపల్ శ్రీ కామాక్షి నగర్ ఏరియా, రీ సర్వే. డి.నెం. 228/ఇ, అంకిరెడ్డిపాలెం గ్రామం డి.నెం. 228 వద్ద 193.61 చ॥గ॥ల విస్తీర్ణం గల ఖాళీ ఇంటి స్థలం యావత్తు ఆస్తి శ్రీ ఉప్పు సత్యనారాయణ & శ్రీ లక్ష్మయ్య గారి కుమారుడు ఉప్పు శంకరరావు గారి పేరున ఉన్నది. **ఆస్తి హద్దులు: తూర్పు :** శ్రీ వెలివెల్లి నాగేశ్వరరావు గారికి చెందిన ఆస్తి, **దక్షిణం :** మున్సిపల్ రోడ్డు, **పడమర :** లక్కాకుల తోమసయ్య గారికి చెందిన ఆస్తి **ఉత్తరం :** శ్రీ తెన్నేరు సత్యనారాయణ గారికి చెందిన ఆస్తి.

ఆస్తి నెం. 2 : గుంటూరు, కొత్త కాలనీ దగ్గర, కొత్త గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, శ్రీ కామాక్షి నగర్ ఏరియా, రీ సర్వే. డి.నెం. 228/ఇ, అంకిరెడ్డిపాలెం గ్రామ డి.నెం.228 వద్ద (28.1/2 సెంట్లు) 1379.40 చ॥గ॥ల విస్తీర్ణం గల ఖాళీ ఇంటి స్థలం యావత్తు ఆస్తి శ్రీమతి రాయని విజయలక్ష్మి, భర్త: కోటేశ్వరరావు & శ్రీ కోల ఆదినారాయణ, తండ్రి : బలరామయ్య గారి పేరున ఉన్నది. **ఆస్తి హద్దులు : తూర్పు :** శ్రీ గోరంట్ల నాగేశ్వరరావు గారి ఆస్తి, **దక్షిణం :** శ్రీ గాజుల నారాయణ గారి ఆస్తి, **పడమర :** అమ్మకందారుని చెందిన ఆస్తి, **ఉత్తరం :** మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు.

ఆస్తి నెం. 3 : గుంటూరు, పొన్నూరు రోడ్డు, ఆనందపేట ఎక్స్‌టెన్షన్, డి. నెం. 17-11-19, పంచవటి అపార్ట్‌మెంట్స్ లో బ్లాక్ నెం. 1 నందలి 44 చ॥గ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేష్యపు వాటా గల స్థలము అందుగల మొదటి అంతస్తులో ఫ్లాట్ నెం. 104, ప్లింత్ ఏరియా 1100 చ॥అ॥లు సహా యావత్తు ఆస్తి శ్రీ ఉప్పు సత్యనారాయణ, తండ్రి : లక్ష్మయ్య గారి పేరున ఉన్నది. **ఆస్తి హద్దులు : తూర్పు :** ఉమ్మడి కారిడార్, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** శూన్యాకాశము, **ఉత్తరం :** శూన్యాకాశము.

తేది : 31-08-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వరద బాధితులకు అండగా నిలబడదాం : సిపిఎం

విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - చీరాల

భారీ వర్షాల కారణంగా విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో వరద తాకిడికి గురై నిరాశ్రయులైన బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిపిఎం నాయకులు అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం గురువారం విరాళాలాలు సేకరించారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయం నుండి విరాళాల సేకరణ ప్రారంభించారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ విజయవాడ, గుంటూరు, ఏలూరు నగరాలు జల దిగ్బంధంలో చిక్కుకొని ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. జిల్లాలో కొల్లూరు, బట్టిప్రోలు మండలాల్లో 20 లంక గ్రామాల్లో అపారమైన నష్టం జరిగిందని అన్నారు. ఆహారం అందక, తాగు నీరు దొరక్క, చివరికి పసిపిల్లలకు గుక్కెడు పాలు కరువై అలమటిస్తున్నారని అన్నారు. వరద బాధిత ప్రాంతాల్లో పునరావాస చర్యలు చేపట్టాలని అన్నారు. విపత్తుల సమయంలో అందరూ కలిసి ప్రజలు సాధారణ జీవనం సాగించేందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందించి మానవత్వం చాటుకోవాల్సిన సమయం వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు, నాయకులు ఎం వసంతరావు, డి నారపరెడ్డి, పి కాలేషా, ఐవి ప్రసాద్, బి సత్యమూర్తి, పోతురాజు పాల్గొన్నారు.

అద్దంకి : సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం గురువారం పట్టణంలో విరాళాలు సేకరించారు. సిపిఎం మండల కార్యదర్శి తంగరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకృతి విపత్తు సమయంలో ఇబ్బందులు పడుతున్న ప్రజల్ని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సహాయ, సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. తమ వంతు కృషిలో భాగంగా సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విరాళాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు ఇస్తున్నట్లు తెలిపారు. విరాళాలు ఇచ్చి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రావులపల్లి కోటేశ్వరావు, తోట వెంకటేశ్వర్లు, కె హనుమంతరావు, కె శ్రీనివాసరావు, అడ్వకేట్ డి గంగాధర్ పాల్గొన్నారు.

అద్దంకి విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఆదాని కంపెనీ పర్యవేక్షణలో ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ రీఛార్జ్ మీటర్లను గురువారం బిగించారు. మండలంలో మొదటి రోజున 16 మీటర్లకు సంబంధించి రీఛార్జ్ స్మార్ట్ మీటర్లను బిగించారు. మొదట వీరు ట్రయల్ రన్‌ను చేశారు. మరొక రెండు నెలల తదుపరి ఈ స్మార్ట్ మీటర్లకు చిప్స్ ఏర్పాటు చేయనున్నారు. మొబైల్ రీఛార్జ్‌లాగా వీటికి కూడా ముందుగానే నగదు చెల్లించి రీఛార్జ్ చేసుకోవాలి. మొబైల్ రీఛార్జ్ లాగా బ్యాలెన్స్ ఉంటేనే విద్యుత్ సరఫరా లభిస్తుంది. మరి కొంతకాలం తదుపరి హౌస్ కనెక్షన్లకు కూడా రీఛార్జ్ స్మార్ట్ మీటర్లను బిగించనున్నారు. కార్యక్రమంలో మండల ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జ్ ఏఈ టి సంతోష్ కుమార్ పర్యవేక్షణలో లైన్ ఇన్‌స్పెక్టర్ వి శ్రీనివాసులు, లైన్మెన్ ఎస్‌కే అబ్దుల్ వహాబ్, ఆదాని ఎలక్ట్రికల్స్ విజయవాడ గ్రూప్ కంపెనీ ప్రతినిధులు జేఈలు ఎం వెంకటేశ్వర్లు, సయ్యద్ ఖాజా, పి నాగూర్ షరీఫ్, షాజహాన్ పాల్గొన్నారు.

జండా ఊపి వాహనాలు ప్రారంభిస్తున్న కొండయ్య

వరద బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

విజయవాడ వరద బాధితుల సహాయార్థమై గ్రామైఖ్య సంఘాల నుండి వెలుగు అధికారులు సేకరించిన బియ్యం, కందిపప్పు, వాటర్ బాటిల్స్, బిస్కెట్స్ వాహనాలను శాసన సభ్యులు కొండయ్య జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య పని పనితీరు అభినందించారు. వరద బాధితుల కోసం చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఇది ఎంతోమందికి ఆదర్శంగా ఉంటుందని అన్నారు. 36బియ్యం బస్తాలు, 30బిస్కెట్ బాక్సులు, 50 కేజీల కందిపప్పు, 30వాటర్ బాటిల్ బాక్సలు, 30కేజీల బూంది పంపించారు. కార్యక్రమానికి ఎపిఎం సుబ్బారావు, ఎంపిడిఒ, సిసిలు, విఒఎలు, అధ్యక్షులు, తెలుగుదేశం, జనసేన, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ ద్వారా విరాళం అందజేస్తున్న టిడిపి నాయకులు

వరద బాధితులకు టిడిపి విరాళం

ప్రజాశక్తి -యద్దనపూడి

యద్దనపూడి మండలానికి చెందిన టిడిపి నాయకులు విజయవాడ వరద భాదితుల సహాయార్థం స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ద్వారా విరాళం అందజేశారు. టిడిపి మండల నాయకులు పాల్గొన్నారు.

నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వి సురేష్ కుమార్

లంక గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో రికార్డులు, పుస్తకాలు పాడైపోవడమే కాక భవనాలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వమే తిరిగి అందించాలని యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఎన్నడు లేని విధంగా కృష్ణానదికి వరద లంక గ్రామాలను అతలాకుతలం చేసిందని అన్నారు. రికార్డుల పుస్తకాలతో పాటు ఇతర సామాగ్రి పూర్తిగా తడిసి పాడైందని తెలిపారు. నూతన పుస్తకాలు మంజూరుతో పాటు విద్యార్థులకు యూనిఫాం సరఫరా చేయాలని కోరారు. దెబ్బతిన్న పాఠశాలలకు తక్షణం మరమ్మత్తులు చేపించేందుకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

బాధితులకు ఆహారం, దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని కులగానివారిపాలెం మదర్ థెరిస్సా వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లంక గ్రామాల వరద బాధితులకు ఆహారం, దుస్తులు గురువారం అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షురాలు పి ప్రియస్వప్న, రత్నరాజు ఆధ్వర్యంలో స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఏర్పాటు చేసిన శిబిరంలో తలదాచుకున్న 100మందికి విఆర్ఒ అంబటి ప్రసాద్ సమక్షంలో అందజేశారు. మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక గ్రామాలతో పాటు కొల్లూరు మండలం కిష్కిందపాలెం, తడికలపూడి, గాజుల లంక గ్రామాల బాధితులు శిబిరంలో ఉన్నారు. ఈ సందర్భంగా స్వప్న ప్రియ మాట్లాడుతూ సర్వం కోల్పోయారని అన్నారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధితులకు మరిన్ని సేవలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంటిడబ్ల్యూఎస్ మేనేజ్మెంట్ సాల్మన్ రాజ్, జాకబ్, మదన్, బుజ్జిబాబు, ప్రకాష్, అనీష్, ఎలీషా, మహేష్, జాన్‌వెస్లీ, సోఫియా, సారా, ఐశ్వర్య, ఏంజెల్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : వరదల కారణంగా సర్వం కోల్పోయిన బాధితులకు అండగా తామున్నామంటూ విఆర్‌కె ట్రస్ట్ చైర్మన్ వేములపల్లి రవి కిరణ్ సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఐదు రోజుల నుండి వరద బాధితులకు వెల్లటూరులో వంటశాల ఏర్పాటు చేసి బాధితులకు భోజన వసతి కల్పించారు. వరద ప్రవహించే సమయంలో బాధితులకు ఆహార పదార్థాలను పడవల ద్వారా తరలించి ఇళ్ల వద్దనే తల దాచుకుంటున్న వారికి అందించారు. వరద తగ్గుముఖం పట్టడంతో వెల్లటూరు నుండి ఏర్పాటు చేస్తున్న వంటశాల నుండి ట్రాక్టర్ల ద్వారా గ్రామాల్లో పంపించి గృహాలు శుభ్రం చేసుకున్న బాధితులకు సరఫరా చేస్తున్నారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాలకు రవి కిరణ్ దగ్గరుండి భోజన వసతిని, త్రాగునీటిని సరఫరా చేయడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతను సిద్ధం చేసి ప్రతి గ్రామానికి ఆహార పదార్థాలు అందే విధంగా చర్యలు చేపడుతున్నారు.

బాధితుల ఆహార పదార్థాల పర్యవేక్షిస్తున్న రవి కిరణ్

బేతపూడిలో గిరిజనులకు సాయం

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని బేతపూడి కాలువకట్టపై జీవిస్తున్న నిరుపేద గిరిజనులకు తెనాలికి చెందిన ట్రైబల్స్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు రావూరి అంజలి బియ్యం, వస్త్రాలు, దుప్పట్లను గురువారం పంపిణీ చేశారు. భారీవర్షాలకు గిరిజనులు పరదాలతో వేసుకున్న తాత్కాలిక నివాసాలు కొట్టుకుపోయిన నేపథ్యంలో ఆయా కుటుంబాలకు తక్షణ సహాయాన్ని అందజేసినట్లుగా తెలిపారు. వరదనీరు వెళ్లిన అనంతరం ప్లాస్టిక్ పరదాలను నివాసం కోసం ఇస్తామన్నారు. నిరాశ్రయులకు ప్రభుత్వం శాశ్వత గృహాలను ఏర్పాటు చేయడానికి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను స్వయంగా కలిసి విజ్ఞాపన చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాస్టర్ యాకోబు, రావూరి సురేష్ బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వరదల వల్ల లంక గ్రామాల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థుల పుస్తకాలు తడిసి పాడైపోవటంతో వారికి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం తరఫున కిష్కిందపాలెం, తిప్పలకట్ట, జువ్వలపాలెం, పెదపాలెంలోని విద్యార్థినీ, విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగులు, పేన్నులు, పెన్సిల్స్, జామెంట్రీ బాక్సులు, బిస్కెట్లు పంపిణీ చేసినట్లు అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులు గుర్రం మురళీ మోహన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అందరూ సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, హరి ప్రసాద్, సుభాని, ఎస్టేట్ బాబు, వెంకట సుబ్బారావు ఉన్నారు.

రిటైర్డ్ ఎంపిడిఒ హఠాన్మరణం

ప్రజాశక్తి - వేటపాలెం

చింతల రూతమ్మ (63)

రిటైర్డ్ ఎంపిడిఒ చింతల రూతమ్మ (63) గుంటూరు రమేష్ హాస్పటల్ నందు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి కన్నుమూశారు. నాలుగు నెలల క్రితమే ఆమె ఉద్యోగ విరమణ చేశారు. ఆమె మృతితో కుటుంబ సభ్యులతో పాటు సహసర ఉద్యోగులు కంటతడి పెట్టారు. 39ఏళ్లు వివిధ హొదాల్లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టి ఎనిమిది నెలలపాటు వేటపాలెం ఎంపిడిఒగా పనిచేసి అందరి మన్ననలు పొందారు. ఆమె స్థానికురాలుగా చీరాల, వేటపాలెం ప్రాంతాల్లో సుదీర్ఘకాలం పనిచేశారు. ఆమె పని చేసిన ప్రతిచోట స్నేహశీలి, మృదు స్వభావిగా పేరు గడించారు. ఆమె భర్త సత్యం పాస్టర్‌గా ప్రజలకు సుపరిచితులు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు డాలీ, స్వీటీ ఉన్నారు. ఆమె అంత్యక్రియలు కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఆమె మృతదేహాన్ని చీరాల, వేటపాలెం ఎంపిడిఒలు కె నేతాజీ, ఎంవిఎస్ శర్మ, డాక్టర్ నోవా, వేటపాలెం ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీల డిడిఓ కార్యదర్శులు సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు.

రైతులకు కన్నీటిని మిగిల్చిన వరద

ప్రజాశక్తి - కొల్లూరు

ప్రకాశం బ్యారేజీ నుండి 12లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోనికి విడుదల చేయడంతో మండలంలోని కృష్ణ పరివాహక లంక గ్రామాలైన పెసర్లంక, ఆవులవారి పాలెం, గాజులంక, కనిగిరి లంక, కొత్తూరు లంక, పోతర్లంక, తోకలవారిపాలెం, తిప్పలకట్ట, జువ్వలపాలెం, కిస్కిందపాలెం తదితర గ్రామాలు, పొలాలు నీటిలో మునిగిపోయాయి. కొన్ని గ్రామాల్లో నీరు పాక్షకంగా తగ్గినప్పటికీ లోతట్టు గ్రామాలు ఇప్పటికీ నీటిలోనే ఉన్నాయి. దీనికి తోడు పంట పొలాల్లో నీరు ఇంతవరకు పోవక పోవడంతో పూర్తిగా దెబ్బతిని కుళ్ళిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో ఎక్కువగా పసుపు, కంద, తమలపాకు, అరటి తోటలు, కూరగాయలు సాగు చేశారు. ఈ పైర్లు పూర్తిగా కుళ్ళిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దీనికి తోడు బుధవారం రాత్రి నుండి అల్పపీడనంతో వర్షాలు కురవడంతో గ్రామాల్లో దుర్వాసన, దోమలు ఎక్కువై ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొన్ని గ్రామాల్లో ఇల్లు పడిపోయిన కుటుంబాలు ఈ వర్షం దెబ్బకి ఎక్కడ ఉండాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు, పారిశుధ్య సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నప్పటికీ కుళ్లిపోయిన వ్యర్థ పదార్థాల వల్ల దుర్వాసన ఎక్కువగా వస్తుంది. దీంతో ఎక్కడ అంటు రోగాలు వస్తాయోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పసుపు, అరటి, తమలపాకు, కంద పైర్లు సాగు చేసిన పొలాల్లో వెయ్యడానికి లక్షల్లో ఖర్చు చేశారు. ఈ పైర్లు కుళ్ళిపోవడంతో రైతు కళ్ళల్లో కన్నీరు తప్ప ఏమీ కనిపించడం లేదు. ప్రభుత్వమే రైతన్నను ఆదుకోవాలని రైతులు కోరుచున్నారు.

బేతపూడిలో ప్రత్యేక పారిశుధ్యం నిర్వహణ

ప్రజాశక్తి - రేపల్లె

అకాల వర్షాలతో ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మండలంలోని బేతపూడిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టామని పంచాయతీ కార్యదర్శి ఎం శ్రీనివాసరావు తెలిపారు. పంచాయితీ పాలకవర్గం, సచివాలయ ఉద్యోగుల పర్యవేక్షణలో ప్రతి వీధిలో బ్లీచింగ్, సున్నం చల్లి సహాయ చర్యలు చేపట్టామని అన్నారు. పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వ లేకుండా ఆయిల్ ఇంజిన్ ద్వారా బయటకు పంపే చర్య చేపట్టామని అన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు రోడ్లు, డ్రెయినేజీలు శుభ్రం చేస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేవిధంగా చూస్తున్నామని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకుని చర్యలు చేపట్టామన్నారు. చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రంగా ఉండేవిధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు తెలిపారు. పంచాయతీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి డ్రైనేజీ పూడికతీత పనులు చేయించారు.

ముందుకు సాగని 'పైప్ లైన్'

- నత్తనడకన పనులు
- తాగునీటి కోసం అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీ ప్రజల దాహర్తి తీర్చేది సాగర్ జలాలే. ప్రస్తుతం సాగర్ జలాలు పుష్కలంగా ఉన్నాయి. కొద్దిపాటి పైప్‌లైన్ నిర్మాణ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. దీంతో సాగర్ జలాలు పూర్తి స్థాయిలో అందక ప్రజలు ఉప్పునీటితో దాహం తీర్చుకోవాల్సి వస్తోంది.

మార్కాపురం మున్సిపాలిటీలో జనాభా లక్ష దాటిందని అంచనా. ఇక్కడి ప్రజల దాహర్తి తీర్చేందుకు కీర్తిశేషులు మాజీ సిఎం డాక్టర్ వైఎస్. రాజశేఖర్ రెడ్డి 2004 అక్టోబర్

నిర్మాణంలో పైప్‌లైన్

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు

27న సాగర్ జలాలతో మార్కాపురం వాసుల దాహర్తి తీర్చేందుకు అవసరమైన తాగునీటి ప్రాజెక్టుకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దూపాడు వద్ద నున్న నాగార్జునసాగర్ కాలువ నుంచి మార్కాపురం వరకూ పైప్‌లైన్ ద్వారా సాగర్ నీటి సరఫరా జరిగేలా డిజైన్ చేశారు. సాగర్ కాలువలో నీటి ప్రవాహ సమయంలో నీటిని నిల్వ ఉంచేందుకు దూపాడు సమీపంలో 2200 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నిర్మించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుండి మార్కాపురం వరకు పైప్‌లైన్ నిర్మాణం జరిగింది. మార్కాపురం పట్టణంలో మూడొంతులకు పైగా నివాస ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడం జరిగింది. మిగిలిన ప్రాంతాల్లో ఇంటింటా కుళాయి కనెక్షన్ కోసం గత వైసిపి ప్రభుత్వంలో రూ. 22.40 కోట్లతో పనులు చేపట్టారు. మొన్నటి వరకు వర్షాభావం వెన్నాడటంతో నాలుగు రోజులకు ఒకసారి సాగర్ నీటిని అందించారు. ఇటీవల కాలంలో తొమ్మిది రోజులకు ఒకసారి సాగర్ నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ నీరు పుష్కలంగా ఉన్నా ప్రజలకు బోర్లలోని ఉప్పునీరే దిక్కయ్యింది.

మార్కాపురం ప్రజలకు సాగర్ నీరు అందించే తాగునీటి ప్రాజెక్టులో భాగమైన పైప్‌లైన్ దూపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి కేశినేనిపల్లి వరకు 4.5 కిలో మీటర్ల పొడవునా దెబ్బతింది. నీటి సరఫరా సమయంలో తరచూ పైప్‌లైన్ పగిలిపోతోంది. దీంతో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతోంది. రోజుల తరబడి మరమ్మతులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం రూ. 4.7 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో కొత్త పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. పనులు ప్రారంభించి ఆరునెలలు దాటింది. ఇప్పటి వరకు 3.5 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం పూర్తయ్యింది. మరో కిలో మీటరు దూరం పూర్తి చేస్తే నీటి సమస్య తీరుతుంది. కొద్దిపాటి పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా సాగర్ జలాలు అందక నీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాత పైప్‌లైన్ ద్వారా నీటిని వదలడం... పైపులు పగిలిపోవడం తరచూ జరుగుతోంది. ప్రస్తుతం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు 70 శాతం నీటితో నింపారు. పాత పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా సాధ్యం కావడం లేదు. కొత్త పైప్‌లైన్ పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి నూతన పైపు లైన్ నిర్మాణం త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకొని తాగునీటి సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని పిఎన్‌సిఎ విద్యాసంస్థల్లో గురుపూజోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ గీతా రాణి కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతా రాణి మాట్లాడుతూ మంచి సమాజ నిర్మాణం కోసం విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని తెలిపారు. ఎంతో విలువలతో పనిచేసే ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని డాక్టర్ గీతా రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.నాగేశ్వరరావు, లెక్చరర్లు ప్రసాద్, వెంకట్రావు పల్లవి, శ్రీకాంత్, మహిమ, రజిత పాల్గొన్నారు.

మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపా ధ్యాయురాలు కె.మహాలక్ష్మి ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. బాష్యం హైస్కూల్‌లో జిల్లా జోనల్ ఇన్‌చార్జి శ్రీకృష్ణ గణేష్, ప్రిన్సిపల్ జయకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు ఎం.స్వర్ణలత ఆధ్వర్యంలో గురు పూజోత్సవాన్ని నిర్వహించారు. శ్రీ చైతన్య టెక్నో హైస్కూల్‌లో ప్రిన్సిపల్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. శ్రీవిద్యానికేతన్ హైస్కూల్, శ్రీవివేకానంద హైస్కూల్, లోటస్ హైస్కూల్, గీతం హైస్కూల్‌లో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు.

శింగరాయకొండలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్ గీతా రాణి

కొప్పోలులో...

ఒంగోలు సబర్బన్ : గురుపూజోత్సవం సందర్భంగా కొప్పోలులోని బిఎస్.ఎయిడెడ్ ప్రైమరీ స్కూల్, బివిఆర్. ఎయిడెడ్ హైస్కూల్, పిఆర్.మెమోరియల్ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను స్థానిక స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంకు మేనేజర్ డివి.సురేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. ఉపాధ్యాయులు,తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు క్యాషియర్ చెంచయ్య, సిబ్బంది ఎం. సంధ్యారాణి, కె.సురేష్, గ్రామస్తులు వసల యోగి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొప్పోలులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బ్యాంకు మేనేజర్ డివి. సురేష్

మార్కాపురంలో..

మార్కాపురం : మార్కాపురం పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో గురుపూజోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. దేశానికి, విద్యా రంగానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు.

మార్కాపురంలోని శ్రీసాయి చైతన్య స్కూల్‌లో...

స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, డాక్టర్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో, ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల, వివేక్‌హెచ్ విద్యా సంస్థలు, శ్రీసాయి బాలాజీ హైస్కూల్, శ్రీసాయి చైతన్య హైస్కూల్, జీవిఆర్ స్కూల్, వాసవీ విద్యానికేతన్, ఓంసాయి వికాస్ విద్యానికేతన్ పాఠశాలల్లో వేడుకలు జరుపుకున్నారు గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు.స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వి.శ్రీదేవి సారధ్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను విద్యార్థులు సత్కరించారు.

కొండపి: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాల్సిన బాధ్యత అందరిపై ఉందని కె.ఉప్పలపాడు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సున్నపుకుమార్ తెలిపారు. మండల పరిధిలోని కె.ఉప్పలపాడు ప్రభుత్వ పాఠశాలలో ఉధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాకమిటీ పూర్వ చైర్మన్ రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలతో సత్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

విరాళాల సేకరణ

ప్రజాశక్తి-కొండపి

వరద బాధితుల సహాయార్థం సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కొండపిలో గురువారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకుడు కెజి. మస్తాన్ మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకొనేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. రూ.6820 విరాళంగా సేకరించినట్లు ఆయన తెలిపారు. విరాళాలను సిపెం జిల్లా కమిటీకి పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.వందనం, సూరిబాబు, రూబెన్, ముప్పరాజు చిన్నబ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన విద్యార్థులు

'రైజ్'లో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-టంగుటూరు

వల్లూరు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇసిఇ చదువుతున్న విద్యార్థులకు మూడు రోజులుగా అరుదూనో అనే అంశం పై వర్క్‌షాప్ నిర్వహించినట్లు కళాశాల కరెస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. గృహ ఆటోమిషన్ సిస్టంలో అరుదూనో యొక్క ఉపయోగాలైన లైటింగ్, ఉష్ణోగ్రత నియంత్రణ, స్వయంచాలక భద్రత వ్యవస్థలు, శక్తి నిర్వహణ, సాధారణ లైన్ ఫాలోయింగ్ రోబోట్, ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ ఆన్ అండ్ ఆఫ్ , సెన్సార్‌లో అగ్నిని గుర్తించడం, గ్యాస్ లీకేజీని గుర్తించటం, దూరాన్ని కొలవటం, నీటి స్థాయిని కొలవటం, తేమ శాతాన్ని కొలవటం, బ్లూటూత్ కార్ డ్రైవింగ్ తదితర అంశాలపై ప్రాక్టికల్‌గా మూడు రోజుల పాటు ఇన్నోవేటివ్ సాఫ్ట్ టెక్నాలజీస్ ఇన్నోవేటివ్ సాఫ్ట్ టెక్నాలజీస్ డైరెక్టర్ యాజవరపు కమల్ కుమార్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ట్రెజరర్ శిద్దా భరత్ మాట్లాడుతూ విద్యార్థులకు యూనివర్సిటీ సిలబస్‌తో పాటు ఇలాంటి వర్క్ షాపులు ఎంతో ఉపయోగ పడతాయని తెలిపారు. కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్ మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపుల్లో విద్యార్థులు పాల్గొని శిక్షణ ద్వారా నేర్చే అంశాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఇసిఇ విభాగాధిపతి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని వెన్నూరు-3 అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాధవీలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు తప్పక పోషకాహారం తీసుకోవాలన్నారు. పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చునని తెలిపారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు తప్పనిసరిగా పోషకాహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ టి.విక్టోరియా రాణి, ఏఎన్‌యం వేణి, అంగన్‌వాడీలు , గర్భిణులు, బాలింతలు కిశోరబాలికలు పాల్గొన్నారు.

ఆళ్ళ సుందర రామిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పీడీ సుందరరామిరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - చీరాల

పేరాల ఎఆర్ఎం హైస్కూల్లో 34ఏళ్లుగా వ్యాయామ, ఎఆర్ఎంఎన్ఆర్ ఉపాధ్యాయునిగా పనిచేసి వేలాది మంది విద్యార్థినీ, విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్ది జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించేలా కృషి చేసిన ఆళ్ళ సుందర రామిరెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. హెచ్ఎం బి సాల్మన్ రాజు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బిర్యానీ ప్యాక్ చేస్తున్న ముస్లింలు

వరద బాధితులకు బిర్యానీ సరఫరా

ప్రజాశక్తి - అద్దంకి

వరద ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికి సహాయ, సహకారాలు అందించాలని పట్టణానికి చెందిన హలాల్ దమ్ బిర్యాని పాయింట్ అధినేత షేక్ బాజీ పేర్కొన్నారు. విజయవాడ వరద బాధితులకు తన వంతు సహాయ సహకారంగా వెయ్యి బిర్యానీ ప్యాకెట్లతో పాటు వాటర్ బాటిళ్లను ప్రత్యేక వాహనంలో తరలించారు. తమ సిబ్బంది, బంధుమిత్రుల సహాయంతో వంటకాలు తయారు చేసి బాధితులకు అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

అద్దంకి : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన హైదరాబాద్ రెకొమాక్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత దాట్ల రాజా తరపు నుండి 1500 మందికి ఆహారం, మంచి నీటిని గురువారం పంపించారు. కార్యక్రమం గ్రామ నాయకులు దాట్ల రత్నాకర్, దాట్ల సురేష్, దేవరపల్లి చంద్రారెడ్డి, మున్నగంటి, నరసింహచారి, గొల్లపాటి వెంకటాచారి పాల్గొన్నారు.

ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మార్టూరు సమీపంలోని కోనంకి హెచ్‌పి పెట్రోల్ బంకు వద్ద గురువారం వేకువ జామున చోటుచేసుకుంది. హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఇసుక దర్శి గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుని కుమారుడు గోపికృష్ణ మండలంలోని కోలలపూడి రైతు భరోసా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా వేకువ జామున విధులకు వెళుతుండగా పెట్రోల్ బంక్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోపికృష్ణని హైవే అంబులెన్స్ సిబ్బంది చిలకలూరిపేటలోని ప్రవేటు వైద్యశాలకు తరలించారు.

ఉపాధ్యాయులకు ఏలూరి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై అవార్డు లందుకున్న ఉపాధ్యాయులను అభినందించారు.

ఏలూరి సాంబశివరావు

డాక్టర్ సర్వేపల్లి జీవితం స్ఫూర్తిదాయకం

సంతమాగులూరు ఎంఆర్‌సిలో ఉపాధ్యాయ దినోత్సవం

కర్లపాలెంలో ఉపాధ్యాయ దినోత్సవం

నిజాంపట్నంలో గురుపూజోత్సవం

ప్రజాశక్తి - సంతమాగులూరు

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎంతో మంది ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రభావితం చేసినందున ఆయన జన్మదినోత్సవాన్ని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించినట్లు ఎంఇఒ వేమవరపు కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక విద్యా వనరుల కార్యాలయంలో జాతీయ ఉపాధ్యాయ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల దండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ వై ఎలమంద, ఎంఈఓ2 డి గిరీష్ కుమార్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పి వలీ ఖాన్, ఎ శేఖర్ బాబు పాల్గొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, మదర్ థెరీసా వర్ధంతి సందర్భంగా గ్రంథ పాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో చిత్రపటాలకు నివాళులర్పించారు.

ఎన్‌టిఆర్ కాలనీలో ఉపాధ్యాయ దినోత్సవం

అద్దంకి : ఎన్టీఆర్ కాలనీ ఎంపీపీ పాఠశాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి హెచ్ఎం కోట అంజమ్మ, శైలజ, జీవనజ్యోతి, శ్రీదేవి, సీతాదేవి, రేణుకాదేవి, రోజారాణి, సువర్ణలత పూల మాల వేసి నివాళులర్పించారు. 5వ తరగతి విద్యార్థి వేసిన సర్వేపల్లి వేష ధారణ బాగా అలరించినది. బొమ్మనంపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం సిహెచ్‌వి శ్రీనివాసమూర్తి అధ్యక్షతన గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. సీనియర్ ఆంగ్ల ఉపాధ్యాయులు కోవి శ్రీనివాసరావును సన్మానించారు. ఉపాధ్యాయులు దామా నాగేశ్వరరావు, కురుగంటి హనుమంతరావు, వరికూటి సుబ్బారావు పాల్గొన్నారు.

పంగులూరు : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మండలంలోని నూజెల్లపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల్లో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం నిర్వహించారు. విద్యా కమిటీ చైర్మన్ మద్దినేని శోభ తోపాటు పాఠశాల ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేసి కేక్ కట్ చేశారు. హెచ్ఎం కేమా వీరాంజనేయులు, విద్యా కమిటీ చైర్మన్ మద్దినేని శోభ స్వయంగా తయారు చేసిన పాయసం విద్యార్థులందరికీ వడ్డించారు.

రేపల్లె భార్గవి హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం

రేపల్లె : పట్టణంలోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు గురువారం నిర్వహించారు. కరస్పాండెంట్ కుర్ర అవర్ణ తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కరస్పాండెంట్ అవర్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ జీవితంలో గురువు చాలా అవసరమని అన్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు.

కర్లపాలెం : క్రమశిక్షణ కలిగిన ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని శ్రీ భార్గవి హై స్కూల్ డైరెక్టర్ పివి సురేష్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను పూలమాలతో సత్కరించారు. డైరెక్టర్ పీవీ సురేష్, హెచ్ఎం బాపట్ల లక్ష్మి, రిజ్వాన బేబీ, దివ్య, సురేష్, చక్రవర్తి, లతా, మస్తాన్, ఇంతియాజ్, రిహానా, షబానా, నాగమ్మ పాల్గొన్నారు.

కారంచేడు : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మండలంలోని కుంకలమర్రు జెడ్‌పి ఉన్నత పాఠశాల నుంచి కె పద్మావతి, పావులూరి శ్రీనివాసరావు, స్వర్ణ పాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కె నరసింహరెడ్డి అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో అవార్డుతో పాటు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్, చీరాల శాసన సభ్యులు ఎంఎం కొండయ్య, పర్చూరు ఎంఈఓలు ఎంవి సత్యనారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిజాంపట్నం : జీవితంలో మంచి నేర్పే మార్గ నిర్దేశకులు గురువులని జనసేన అధ్యక్షుడు మైలా నరేష్ యాదవ్ అన్నారు. ముత్తుపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో హెచ్ఎం వనజాక్షి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల చైర్మన్ మురుగుపల పున్నారావు, టీడీపీ నాయకులు ఆళ్ల పూర్ణయ్య, యార్లగడ్డ గోపి పాల్గొన్నారు.

పర్చూరులో ఉపాధ్యాయులకు సన్మానం

పర్చూరు : మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ తేళ్ల వెంకట రాము, డైరెక్టర్ అనురంజని ఉపాధ్యాయులను సత్కరించారు. బిరుదు నాగేశ్వరరావు, షేక్ అయూబ్, కె జాన్ బోస్, కె విజయ్ కుమార్, శేషగిరిరావు, పోలిరెడ్డి, ఆనందకుమారి, శారద, దాసు, శ్రీనివాసరావు, అఫ్సానా బాను ఉన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చెరుకూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లోని 16మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. తోకల కృష్ణ మోహన్, హెచ్ఎం బెంజిమన్ హనోక్, ఎంఈఓ వెంకట రామయ్య, కోమటి ఆంజనేయులు, కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగరం : స్థానిక ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. రేపల్లె ఆదర్శ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌కె మోహిత్ మాట్లాడారు. ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఇఒ రామాంజనేయులు, హెచ్ఎం నాగరాజు పాల్గొన్నారు.

పంగులూరు నూజిల్లపల్లిలో ఉపాధ్యాయ దినోత్సవం

కారంచేడు ఉపాధ్యాయులు శ్రీనివాసరావుకు సన్మానం

నగరంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా అవగాహన

ప్రజాశక్తి - కారంచేడు

పౌష్టికాహార మాస ఉత్సవాలు, ఈసీసీఈ డే భాగంగా పోషణా పడాయి కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండలంలోని జరుబులవారిపాలెం అంగన్‌వాడి కేంద్రంలో ప్రీ స్కూల్ పిల్లల తల్లులకు పౌష్టికాహారంపైన అవగాహన కల్పించారు. పిల్లల సర్వతో ముఖాభివృద్ధి, ఆరోగ్యంకు పౌష్టికాహారం తోడ్పడుతుందని సిడిపిఓ ఝాన్సీ చెప్పారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సునీత, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంగులూరు : బిడ్డల పెంపకంపై తల్లులు అవగాహన కలిగి ఉండాలని, చిన్నప్పటి నుండి పిల్లలను చదువుపట్ల ఆకర్షితులను చేయాల్సిన అవసరం తల్లులపై ఉందని ఐసిడిఎస్ పంగులూరు సెక్టార్ సూపర్వైజర్ జయప్రద అన్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ కార్యక్రమంపై తల్లులకు గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భువనేశ్వరి, ఆయా మాధవి, తల్లులు పాల్గొన్నారు.

ఆరికట్లవారిపాలెంలో మాట్లాడుతున్న సూపర్వైజర్ జయప్రద

యద్దనపూడి : స్థానిక ఎస్‌సి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రి స్కూల్ విద్యా విధానంపై తల్లులకు గురువారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్వైజర్ సిహెచ్ సుజాత మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, నాగమ్మ, ఆశా కార్యకర్త శిరోమణి, ఆయాలు అరుణ కుమారి, హెప్సి, తల్లులు పాల్గొన్నారు.

మెదరమెట్ల : కొరిశపాడు అంగన్‌వాడి కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు గురువారం జరిపారు. సిడిపిఓ ఎ కృష్ణకుమారి మాట్లాడుతూ ప్రకృతి వాతావరణంలో ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా మీ పెరటిలో ఆకుకూరలు, కూరగాయలు పండించి తిన్నట్లయితే గర్భవతులు, బాలింతలు, కిషోర్ బాలికలు, మహిళలకు రక్తహీనత రాకుండా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కె ఇందిర, అంగన్‌వాడి కార్యకర్తలు పవన్ కుమారి, అరుణకుమారి, సురేఖ, అనురాధ, అంజలిదేవి, సౌజన్య, హెల్పర్స్‌తో పాటు ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎల్ఐసి మేనేజర్ఓ సత్యనారాయణ

ఎల్ఐసి వార్షికోత్సవం

ప్రజాశక్తి - అద్దంకి

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ 68వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సమాజంపై జీవిత బీమా ప్రభావం అనే అంశంపై హై స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ, తృతీయ సాయి, ఎన్ రమ్యశ్రీ, షణ్ముఖ ప్రేమ్‌కు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు. సీనియర్ డిఒలు, ఏజెంట్లకు బ్రాంచి ఎస్బిఎం వి మాధవ్ కృష్ణ, షేక్ ఖాదర్ మస్తాన్ సాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో తోటకూర సత్యనారాయణ, డివిఎం సత్యనారాయణ, ఎం రఘురాంరెడ్డి, పిఆర్ శ్రీధర్, రాంబాబు, హరీష్, వినీత్, పద్మజ, శ్రీవాణి, సీతారామయ్య, మల్లికార్జునరావు, మన్నం త్రిమూర్తులు, ఆర్టీసీ సుబ్బారావు, పరిటాల శీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మత్స్యశాఖ ఎడి బి సైత

మత్స్యకారులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - రేపల్లె

వరదల వల్ల నష్టపోయిన మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని మత్స్య శాఖ సహాయ సంచాలకులు బి సైదా పేర్కొన్నారు. రేపల్లె, నిజాంపట్నం మండలాల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన ఆక్వా రైతులు, మత్స్యకారుల బోట్లు, పడవలు, వలలకు నష్టం అంచన విలువ తయారు చేసేందుకు మత్స్యకార సహాయకులు, సాగర మిత్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరిస్తారని తెలిపారు.

పంటలను పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

తక్షణమే నష్టపరిహారం అందించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

లంక గ్రామాల్లో దెబ్బతిన్న వాణిజ్య పంటలకు తక్షణమే నమోదు చేసి నష్ట పరిహారం అందించాలని మాజీ మంత్రి మెరుగు నాగార్జున, మాజీ శాసన సభ్యులు అన్నాభత్తుని శివకుమార్ డిమాండ్ చేశారు. వరదలకు దెబ్బతిన్న గ్రామాల్లో గురువారం పర్యటించి పంటలను పరిశీలించారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు త్రాగునీరు, ఆహారం వంటి వసతులు కల్పించడంతోపాటు వరద తగ్గిన అనంతరం గ్రామాల్లో దెబ్బతిన్న గృహాలను నమోదు చేయించి ప్రతి గృహానికి పరిహారం ఇవ్వాలని కోరారు. రూ.లక్షల పెట్టుబడులు పెట్టిన పంటలు పూర్తిగా వరద పాలయ్యాయని అన్నారు. తక్షణ పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి ఇన్చార్జ్ వరికూటి అశోక్ బాబు, ఈవూరు గణేష్ పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో ఆనందబాబు విస్తృత పర్యటన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల్లో శాసన సభ్యులు నక్కా ఆనందబాబు గురువారం విస్తృతంగా పర్యటించారు. ప్రజలకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతటి వరద ఎప్పుడు చూడలేదని అన్నారు. లంక గ్రామాల్లో ప్రజలు ఒక విలయాన్ని చూశారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకాశం బ్యారేజీ నిర్మాణం జరిగిన తర్వాత ఇలాంటి వరద ఎప్పుడు చూడలేదని అన్నారు. లంక గ్రామాల్ని మూడు రోజులుగా ముంచెత్తాయని అన్నారు. ప్రజలు జల దిగ్బంధంలోనే ఉండిపోయారని అన్నారు. ఇప్పుడిప్పుడే వరద తగ్గుతున్న నేపథ్యంలో సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు వివరించారు. వరద రాకముందే ముందు జాగ్రత్త చర్యగా అధికారులు అందరినీ అప్రమత్తం చేసారని, వరద సమయంలో ప్రజలకు ఆహారం, తాగునీటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వరద తగ్గడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యాలకు గురికాకుండా గ్రామాలను శుభ్రపరిచే దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తెలుగు యువత అధికార ప్రతినిధి కనగల మధుసూదన్ ప్రసాద్‌తో పాటు జనసేన నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్నారని చెప్పారు. ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడ వరదల్లో ప్రజలకు అండగా నిలబడ్డారని అన్నారు. వరదల్లో ఉండి సహాయక చర్యలు అందించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్తామన్నారు. పశు సమర్ధక శాఖను అప్రమత్తం చేసి పశువులకు ఇబ్బంది లేకుండా దాణాను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు పూర్తిగా పంటలు నష్టపోయారని

ట్రాక్టర్‌పై లంక గ్రామాల్లో ఆనందబాబు, రవికిరణ్ పర్యటన

అన్నారు. నీళ్లు తగ్గగానే రైతుల పంటలు ఎనిమరేషన్ చేసి నష్టపరిహారం అందిస్తామన్నారు. ఆయన వెంట పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ హనుమంతరావు, నాయకులు మైనేని మురళీకృష్ణ, కనకాల మధుసూదన్ ప్రసాద్ ఉన్నారు.

భట్టిప్రోలు : కొల్లూరు మండలం కిష్కిందపాలెం, జువ్వలపాలెం, కొత్తగూడెం గ్రామాల్లో శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, విఆర్‌కె ట్రస్ట్ చైర్మన్ వేములపల్లి రవికిరణ్ ట్రాక్టర్లపై పర్యటించారు. బాధితులను పరామర్శించారు. వరద ముంపు ప్రాంతాలను పరిశీలించి గ్రామస్తుల సమస్యలు వింటూ మనోధైర్యం కలిగిస్తూ గ్రామాల్లోని పరిస్థితులు, రోడ్లు, దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించారు. ప్రభుత్వం నుండి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసాని ఇచ్చారు. విఆర్‌కె ట్రస్టు ద్వారా లంక గ్రామాల బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని రవికిరణ్ తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్, తెలుగుదేశం కొల్లూరు అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, జనసేన ఇన్‌ఛార్జి ఊసా రాజేష్ పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల, హరనాథ్ బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను విన్నవించుకున్నారు. తక్షణమే ఆ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎంపీపీ ఆదేశించారు. సమావేశంలో గుర్తించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కార్యాలయం ఎఒ డి రమేష్, వైస్ ఎంపీపీలు సుబ్బారావు, ఉన్నవ వెంకటేశ్వరరావు (చంటి), ఎంపీటీసీ నాజర్ ఖాన్, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

నిజాంపట్నం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు గురుకులంలోని సమస్యలను సమావేశంలో ఎంపీపీ దృష్టికి

సమావేశంలో ఎంపిపి మోపిదేవి విజయనిర్మల

తెచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గురుకులం ఆవరణ మొత్తం వర్షపు నీటితో మునిగిందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయాలని కోరారు. గురుకులం ఆవరణలో విద్యుత్ లైట్లు వెలగడం లేదని తెలిపారు. కొత్త లైట్లు వేయించాలని కోరారు. ఆర్ఒ ప్లాంట్ అప్పుడప్పుడు మరమ్మతులకు గురై మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీ స్పందిస్తూ గురుకులంలో సమస్యలన్నీ పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ముఠా అరెస్టు

ప్రజాశక్తి - చీరాల

ఉద్యోగాలు ఇప్పిస్తామని, తక్కువ ధరకే బంగారం వస్తుం%ఎ%ని మాయమాట చెప్పి సొమ్ము చేసుకునే ముఠా చేతిలో విలువైన సొమ్ము మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ జగదీష్ నాయక్ అన్నారు. ఉద్యోగం పేరుతో వాటర్ డ్రైవర్ మోసం చేసి రూ.1.50లక్షలు దండుకున్న ముఠాగుట్టును ఈపురుపాలెం పోలీసులు అరెస్టు చేశారు. ఈపురుపాలెం స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త రెడ్డిపాలెంకు చెందిన ఎన్ పోలిరెడ్డి 10వ తరగతి చదువుకొని ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఐటీసీ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి ఫోన్ చేసి మాయమాటలు చెప్పి ఉద్యోగానికి ముందు రూ.1.50లక్షలు కట్టాలని, మిగిలిన డబ్బులు ఉద్యోగం వచ్చాక కట్టాలంటూ నమ్మబలిగాడు. ఆ మాటలు విని బాధితుడు సరే అనడంతో నగదు తీసుకొని ఓడరేవు రావాలని చెప్పారని, నగదు తీసుకొని వాడరేవు వెళ్లడంతో అక్కడ ఇద్దరు వ్యక్తులు డబ్బు తెచ్చారాని అడుగుతూ ఉండగా మరో నలుగురు వచ్చి దొంగ నోట్లు మారుస్తున్నారా అంటూ బెదిరించి దాడి చేసి డబ్బులతో పరారయ్యారని బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ జగదీష్ నాయక్

విషయంపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేశారు. నెల్లూరు జిల్లా సింగుపేటకు చెందిన గుత్తి భరత్ కుమార్, చీరాల వాడరేవుకు చెందిన రాగిరి శివ మల్లికార్జున్, పాలపర్తి సాయి, బెల్లంకొండ రాము, వెదుళ్లపల్లికి చెందిన పోలా హరీష్, కరీంనగర్‌కు చెందిన కౌశిక్ నిందితులుగా గుర్తిచ్చామని అన్నారు. వీరిలో ప్రధాన నిందితులైన కౌశిక్, పోలా హరీష్ పరారీలో ఉండగా మిగిలిన ముద్దాయిలను ఎస్ఐ శివకుమార్ అరెస్టు చేశారని తెలిపారు. వారి వద్ద నుండి రూ.1లక్ష నగదు, నకిలీ కరెన్సీ రూ.500నోట్లు రూ.19 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ పాల్గొన్నారు.

సంఘటనా స్థలంలో శవాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక శివ బ్రహ్మ కాలనీకి చెందిన గోనుగుంట్ల వేదవతి (40) అనే మహిళ గత అర్ధరాత్రి స్వగృహంలో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకొని చనిపోయిన సంఘట జరిగింది. ఆమె కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని సీఐ వైవి రమణయ్య, ఎస్ఐ సురేష్ పరిశీలించారు. వివరాలు సేకరించారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్ట్ కోసం ఏరియా వైద్యశాలకు పంపించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. గురువారం ఉదయాన్నే లేచి చూచేసరికి ఫ్యానుకు ఉరివేసుకున్నట్లు తెలిపారు. మృతురాలు అంగన్‌వాడి ఆయాగా పనిచేస్తుంది. అంతేగాకుండా ప్రతిరోజు తీరిక సమయంలో సాయంత్రం పూట ఇంకొల్లులోని ఓ ప్రైవేటు పాల అమ్మకం కేంద్రంలో సహాయకరాలుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది.

మండపాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

వినాయక చవితి మండపాలకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగిల్ విండో విధానం ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటే త్వరితగతిన అనుమతులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నిర్వాహకులు పంచాయతీ, ఫైర్, విద్యుత్తు అనుమతులు తీసుకోవాలని అన్నారు. డిజె పర్మిషన్, విగ్రహం ఏర్పాటు చేయడానికి అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా క్లియర్ చేస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకులు అనుమతి పత్రాలు అన్నింటిని ఆన్లైన్లో సబ్మిట్ చేస్తే వెంటనే అనుమతి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా, స్నేహ పూర్వక వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సంగీతం మాస్టారు ప్రతాప్‌కు సన్మానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక గంగా పార్వతీ సమేత భీమేశ్వర ఆలయంలో సంగీతం మాస్టారు మద్దినేని ప్రతాప్ కుమార్‌ను సంగీతం నేర్చుకున్న మహిళా శిష్యురాలు గురువారం శాలువుతో సన్మానించారు. ప్రతాప్ కుమార్ హార్మోనిస్టే కాకుండా వివిధ భక్తి గీతాలు, సంగీతం పాటలతోపాటు అన్నమయ్య కీర్తనలు పాడటంలో విశిష్ట గాయకుడిగా మన్ననలు పొందారు. సంగీత, భక్తి పాటలు, అన్నమయ్య కీర్తనల కచేరీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆవుల వసుంధర, తుమాటి రాజ్యం, గంటా సుకన్య, ముప్పరాజు నాగలక్ష్మి, తుమాటి విజయ, మాధవి, లక్ష్మి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన 97-98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు వరదకు నష్టపోయిన నాలుగు గ్రామాల్లో క్యాండిల్స్, దోమల అగరవత్తులు, అగ్గిపెట్టెలు పంపిణీ చేశారు. వాటితోపాటు 600మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రావువారి వెంకట శివప్రసాద్ తెలిపారు.

వరద బాధితులకు

12 వేల వాటర్ బాటిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దోస్త్ ఫౌండేషన్, ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో 12 వేల వాటర్ బాటిల్స్‌ను విజయవాడలోని వరద ముంపు బాధితులకు గురువారం అందజేశారు. వర్షాల కారణంగా ముంపునకు గురైన విజయవాడ ప్రాంతంలో దోస్త్ ఫౌండేషన్ బందం ఆధ్వర్యంలో ప్రజా అవసరాల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటికే గత మూడు రోజులుగా పెద్ద ఎత్తున విజయవాడలోని పలు ప్రాంతాలకు ఆహార పొట్లాలు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. దోస్త్ ఫౌండేషన్ పిలుపు మేరకు పలువురు దాతలు ఆహారం, వస్త్రాలు, మంచినీరు అందజేశారు. ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో 12 వేల వాటర్ బాటిల్స్ వరద బాధితులకు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ జి ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ కె.అనిల్ కుమార్, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, ఆశాలత ట్రస్ట్ ఫౌండర్ కె సిల్వన్‌రాజు, రిటైర్డ్ టీచర్ అసోసియేషన్ టంగుటూరు నాయకులు జి ధనరాజు, ఒంగోలుకు చెందిన పి.శ్రీనివాస్, కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

నష్టపోయిన వారందరినీ ఆదుకుంటాం..

కలెక్టర్ జె.వెంకటమురళి

ప్రజాశక్తి-కొల్లూరు, బాపట్ల జిల్లా

వరద దాటికి నష్టపోయిన వారందరినీ ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. వేమూరు, కొల్లూరు మండలలోని ఆవుల వారిపాలెం, పెసరలంక, పెద్ద లంక గ్రామాలలో జిల్లా కలెక్టర్ గురువారం విస్తృతంగా పర్యటించారు. పెసరలంక గ్రామంలో నిత్యావసర సరుకుల పంపిణీని నిశితంగా పరిశీలించారు. సరుకుల నాణ్యతను చూశారు. పెసరలంక గ్రామాలలోని ప్రజలకు తయారుచేసిన ఆహార పదార్థాలు, పశుగ్రాసం బస్తాలను పరిశీలించారు. రేపటి నుంచి గృహాల సర్వే, పంటల సర్వే ప్రారంభమవుతుందని ప్రజలు సహకరించాలన్నారు.

పెసరలంక గ్రామంలో మట్టి గోడలతో నిర్మించిన పూరి గుడిసె పూర్తిగా దెబ్బతినడంతో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గృహ యజమాని తుంగల వెంకటేశ్వర్లుతో మాట్లాడారు. మేట వేసిన బురదను తొలగించి శుభ్రం చేసుకుంటున్న ఇంటిలోకి వెళ్లి నిశితంగా పరిశీలించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న కుటుంబాల వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. వేమూరు మండలం మార్కెట్ యార్డ్ వద్ద హెలిప్యాడ్ ఏర్పాటుపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపాన్ని పరిశీలించారు. వరద ముంపుపై అధికారులతో సమీక్షించే వేదికను పరిశీలించారు. ఆయన వెంట, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేలవాలిన గృహాలు..దెబ్బతిన్న పంటలు..

ప్రజాశక్తి-భట్టిప్రోలు

కృష్ణానదికి సంభవించిన వరదల కారణంగా లంక గ్రామాల్లో పూరి గృహాలు వరద ఉధతికి నేలవాలాయి. రైతులు సాగుచేసిన వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో సుమారు 8 వేల ఎకరాలలో రైతులు సాగు చేసిన పసుపు, కంద, అరటి, తమలపాకు, బొప్పాయి, కూరగాయల వంటి పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులను కోలుకోలేని పరిస్థితి తెచ్చాయి. భట్టిప్రోలు మండలంలో చింతమోటు పెదలంక మధ్య గూడెం మరియు కొల్లూరు మండలంలో పలు గ్రామాల్లో అక్కడక్కడ పేదల పూరిగృహాలు వరద తాకిడికి దెబ్బతిన్నాయి. ముఖ్యంగా దుంప దశలో ఉన్న కంద పంటపై ఒండ్రు మట్టి పేరుకుపోవడంతో పంటలు పూర్తిగా రంగు మారిపోయి.. నీరు తగ్గిన అనంతరం నేలవాలి ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. అదే రీతిలో పసుపు, కూరగాయల పంటలు కూడా ఇప్పటికే ఎండుముఖం పట్టాయని, అరటి పంట కూడా నిలబడి ఉన్నప్పటికీ వరద తగ్గిన అనంతరం క్రమక్రమంగా చెట్లు ఎండిపోయి విరిగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లంక గ్రామాల్లో ఉన్న డీలర్ షాపులలో లబ్ధిదారులకు అందించాల్సిన బియ్యం వరద నీటిలో తడిచిపోయి పాడైపోయాయి. స్టాక్ పాయింట్‌లో ఉన్న బియ్యం

లంక గ్రామాల్లో వరద మిగిల్చిన దుస్థితి..

చింతమోటులో వరదకు కూలిపోయిన పూరిగుడిసె

తడిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ తినడానికి పనికిరాని విధంగా చెడిపోయాయని లంక గ్రామాల డీలర్లు సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తున్నారు. ఈ రెండు మండలాల్లో ఉన్న 22 గ్రామాల్లోని ప్రభుత్వ

వరదలకు దెబ్బతిన్న బొప్పాయి తోట

పాఠశాలల్లో వరద నీరు ప్రవేశించి రికార్డులు, విద్యార్థుల పుస్తకాలు తడిచిపోయి ధ్వంసం అయ్యాయని, వీటి స్థానంలో ప్రభుత్వం నూతన పుస్తకాలను అందించాల్సిన ఆవశ్యకత ఉందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పెసర్లంకలో గల జిల్లా పరిషత్ మండలపరిషత్ పాఠశాలల్లో దాదాపు మూడు నుండి నాలుగు అడుగుల మేర ఒండ్రు మట్టి పేరుకుపోయి శుభ్రపరచడానికి కూడా వీలు లేని విధంగా ఉండటంతో ఉపాధ్యాయులు వి.సురేష్‌కుమార్ ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లడంతో ఫైర్ ఇంజన్ పంపించి.. శుభ్రం చేయించారు.

వరదల కారణంగా ఇంటిలో సామాగ్రి, నగదు, ఇతర వస్తువులు కోల్పోవడమే కాక లంక గ్రామాల్లో ఇప్పట్లో కూలీలకు పని లభించే పరిస్థితి లేదని, దీని దష్ట్యా ప్రభుత్వమే ఉపాధిని కల్పించాలని కోరుతున్నారు. బ్యాంకుల నుండి డ్వాక్రా రుణాలు, ఇతర రుణాలు పొందిన వారికి ఎలాంటి ఉపాధి లేకపోవడంతో చెల్లించే పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి వరదలకు దెబ్బతిన్న గ్రామాలకు డ్వాక్రా రుణాలను రద్దు పరచి మరోమారు రుణాలు అందించి ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. అదే రీతిలో పంటలు దెబ్బతిన్న రైతులకు మరోవారు సాగు చేసుకోవడానికి అవసరమైన విత్తనాలను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

20 వరకు ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా జిల్లాలో ఇంటింటి సర్వే ఈ నెల 20 వరకు జరుగుతుందని డిఆర్ఒ ఆర్. శ్రీలత ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 20 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైనదని, ఇప్పటి వరకు 40 శాతం పరిశీలన పూర్తయిందన్నారు. జాబితాలో తమ పేరు లేని అర్హులు బి.ఎల్.వో. దృష్టికి తీసుకెళ్లి జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని, మార్పులు చేర్పులకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు.

డ్వామా పీడీపై క్రమశిక్షణా చర్యలు

ప్రజాశక్తి-బాపట్ల

లంక గ్రామాల్లో పునరావాస కార్యక్రమాల్లో నిర్లక్ష్యం వహించిన కారణంగా బాపట్ల జిల్లా డ్వామా పీడీ రాజేష్‌ను పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నారని, సహకార శాఖ అధికారితో పాటు మరో ఇద్దరు ఉద్యోగులపై వేటు వేసిన కలెక్టర్ డ్వామా పీడీపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు.

వరద బాధితులకు

సింథైట్ కంపెనీ రూ.10 లక్షల సాయం

ప్రజాశక్తి-మేదరమెట్ల

వరద బాధితులను ఆదుకోవడం అభినందనీయమని కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. వరద బాధితులకు అత్యవసర సహాయం కింద రూ.10 లక్షల విరాళాన్ని సింథైట్ మిర్చి ఫ్యాక్టరీ యాజమాన్యం గురువారం అందించింది. కొరిశపాడు మండలం, మేదరమెట్లలోని సింథైట్ మిర్చి ఫ్యాక్టరీ సీనియర్ మేనేజర్ అబ్దుల్ సలీం జిల్లా కలెక్టర్ వెంకటమురళికి కొల్లూరు మండలం ఎండిఓ కార్యాలయంలో కలసి రూ.10 లక్షల చెక్కును అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడానికి సంస్థలు ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. మరో రూ.90 లక్షలు ఇవ్వడానికి ఫ్యాక్టరీ యాజమాన్యం చర్యలు తీసుకుంటుందని అబ్దుల్ సలీం చెప్పారు.

రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న దృశ్యం

దేశాభివృద్ధిలో ప్రముఖమైంది గురువుల పాత్ర

బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

దేశాభివృద్ధిలో ప్రముఖమైనది గురువులు ప్రముఖ పాత్ర అని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బాపట్ల పట్టణంలోని అన్నం సతీష్‌ప్రభాకర్ కళ్యాణ మండపంలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. వేటపాలెం మండలం, అక్కాయిపాలెం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.బ్రహ్మరెడ్డి, అమృతలూరు మండలం ప్యాప్రు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సాంబశివరావు, కారంచేడు మండలం, కుంకలమర్రు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పద్మావతి ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఎంపికయ్యారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ నుంచి శ్యామ్యూల్, చీరాల మండలం, జాండ్రపేట బివి అండ్ బిఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి పి.పూర్ణచంద్రరావు, అద్దంకి మండలం, చక్రాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పి.జ్యోతినిర్మల, వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల నుంచి పివి రామారావు, అద్దంకి మండలం రాజీవ్‌నగర్ కాలనీ ఎంపిపి స్కూల్ నుంచి కె రామయ్య,నిజాంపట్నం మండలం బలవారిపాలెం ఎంపిపి స్కూల్ నుంచి టి.పద్మావతి, అద్దంకి మండలం సివి స్ట్రీట్ ఎంపియుపి స్కూల్ నుంచి ఎమ్ ధనలక్ష్మి, కారంచేడు మండలం, కుంకలమర్రు ఎంపిపి స్కూల్ నుంచి పి.శ్రీనివాసరావు, బల్లికురవ మండలం చెన్నుపల్లి ఎంపియుపి స్కూల్ నుంచి జి.శ్రీనివాసరావు, మార్టూరు మండలం ద్రోణాదుల ఎంపిపి ఉర్దూ స్కూల్ నుంచి షేక్ జాన్‌బాషా, బాపట్ల ఎవివి ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ ఎ.ఉమామహేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా బాపట్ల లోక్ సభ సభ్యులు తెన్నేటి కష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మన జీవనంలో గురువులు ప్రముఖ పాత్ర పోషిస్తారన్నారు. వారు అందించే జ్ఞానం, మార్గనిర్దేశం మన జీవితాలకు వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. ఉత్తమ బోధన చేస్తున్న గురువులను సత్కరించి గౌరవించుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల భవితను తీర్చిదిద్దే ఉపాధ్యాయులు ఎంత ప్రశాంతంగా ఉంటే సమాజానికి అంత మంచిదన్నారు. వారికి పని ఒత్తిడిని తగ్గించాలంటే ఉపాధ్యాయ నియామకాలు తరచూ జరగాలన్నారు. ఎంపి కష్ణప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ ఫైలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేశారని తెలిపారు. చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్రిబాబు, జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు, ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ దర్శి టౌన్ అధ్యక్షుడు వజ్జా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువులను ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, బి.రమాదేవితో పాటు పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.
- ప్రజాశక్తి, దర్శి

ప్రజాశక్తి

ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ
ప్రత్యేక అనుబంధం

పొదిలి, ప్రకాశం జిల్లా 8 పేజీలు సెప్టెంబర్ 2024 Advt feature

అక్షర యజ్ఞంలో మరో అడుగు..

తెలుగు నేలపై ప్రారంభమైన మొట్టమొదటి దినపత్రిక ప్రజాశక్తి. 1942లో వారపత్రికగా ప్రారంభమై 1945లో దినపత్రికగా ఎదిగింది. ఈ గమనంలో అనేక ఆటుపోట్లను, ఎత్తుపల్లాలనూ అధిగమించింది. 43 ఏళ్ల క్రితం ప్రజాశక్తి దినపత్రికగా పున:ప్రారంభమై "ప్రతి అక్షరం ప్రజల పక్షం" నినాదంతో 44వ వార్షికోత్సవం జరుపుకొంటున్న సమయం ఇది. ప్రజా ఉద్యమంలోనూ, పత్రికా రచనల్లోనూ సవ్యసాచి లా రాణించిన మోటూరు హనుమంతరావు సంపాదకత్వం లో, మహానేత పుచ్చలపల్లి సుందరయ్య దార్శనికతలో 1981 ఆగస్టు 1న విజయవాడ కేంద్రంగా ప్రారంభమైన ప్రజాశక్తి అనతి కాలంలోనే ఉమ్మడి రాష్ట్రంలో 10 కేంద్రాలకు విస్తరించింది. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్ర ప్రదేశ్‌లో నేడు 8 కేంద్రాల నుండి ప్రచురితమవుతోంది. పత్రికా రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికను అందుకోవడానికి ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా పోరాటా లకు అక్షరసాయాన్ని అందిస్తూ ప్రత్యా మ్నాయ జర్నలిజాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రజల సహకారం, సిబ్బంది నిబద్ధత ఆధారంగా ప్రజాశక్తి పయనం ముమ్ముందుకు సాగుతోంది.

ప్రతి అక్షరం..ప్రజల పక్షం..

- ఒంగోలులో ప్రచురణ కేంద్రం
- అంచెలంచెలుగా ఎదిగి నేడు అగ్రశ్రేణి పత్రికల సరసన 'ప్రజాశక్తి'
- రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాల విశ్లేషణల్లో ప్రత్యామ్నాయ వాణి

ప్రజాశక్తి-బాపట్ల, ఒంగోలు బ్యూరో

ప్రజాశక్తి దినపత్రిక ఒంగోలు ప్రచురణ కేంద్రం ప్రజల పక్షాన నిలబడింది. ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదానికి కట్టుబడి ప్రజాశక్తి ప్రస్థానం సాగుతోంది. సంస్థ యావత్ సిబ్బందీ నిరంతరం పట్టుదల క్రమశిక్షణతో పనిచేస్తున్నారు. నిజాలను నిర్భయంగా రాయడంలోనూ.. నిజాయితీగా పనిచేయడం లోనూ ఎక్కడా రాజీపడకుండా ముందుకు సాగుతున్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా ఎదురొడ్డి నిలబడుతున్నారు. పత్రిక లక్ష్యమే తమ జీవిత లక్ష్యంగా పనిచేసే సిబ్బంది ప్రజాశక్తిలో ఉన్నారు. ప్రజల మన్ననలు పొందడంలోనూ క్రియాశీలకంగా వ్యవహరిస్తూనే ఉన్నారు. అదే స్థాయిలో అన్ని వర్గాల ప్రజానీకం, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ కార్మిక సం ఘాలు, అధికార వర్గాల నుంచీ ఆదరణ కూడా ప్రజాశక్తికి లభిస్తోంది.

ప్రజాశక్తి ఒడిదుడుకులను అధిగమిస్తూ నేడు ప్రధాన పత్రికల స్రవంతిలో కలిసింది. అంచెలంచెలుగా ఎదిగి నేడు అగ్రశ్రేణి పత్రికల్లో ఒకటిగా నిలిచింది. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాల్లో ప్రజల పక్షాన నిలిచింది. ప్రజల కోసం ప్రత్యామ్నాయ వాణిని వినిపిస్తోంది. ప్రజల ఎజెండా ఏమిటో పాలకులు ముందుంచడంలో ముందుంది. ప్రజాఉద్యమాలు, పోరాటాలకు బాసటగా నిలిచింది. ఈ కర్తవ్యం నెరవేర్చడంలో ప్రజాశక్తి కీలకపాత్ర పోషిస్తోంది. అందులో ఒంగోలులో ప్రచురణ కేంద్రం ప్రధాన మైలురాయిగా నిలిచింది. కరోనా సమయంలో పత్రికా రంగం మొత్తం సంక్షోభంలో పడింది. అందులో ప్రజాశక్తి కూడా మినహాయింపు కాదు. అప్పటివరకూ పత్రిక నిర్విరామంగా సాగినా కరోనా సమయంలో ఒడిదుడుకులు తప్పలేదు. అన్ని పత్రికలతో పాటు ప్రజాశక్తి కూడా జిల్లా పేజీలను నిలిపేయడం జరిగింది. మళ్లీ 20 ఏళ్ల క్రితం ఏ స్థాయిలో ఉందో ఆ స్థాయికి చేరింది. మళ్లీ మొక్కవోని దీక్షతో యధాస్థితికి తెచ్చే యత్నం సాగుతోంది. తిరిగి జిల్లా పేజీలను పునరుద్ధరించడం జరిగింది. మళ్లీ పత్రికను కరోనా ముందున్న స్థితికి తీసుకుపోయే యత్నం జరుగుతోంది.

ఉమ్మడి ప్రకాశంలో ప్రజాశక్తి ప్రస్థానం

దినపత్రికగా ఆవిర్భవించాక ప్రారంభంలో ప్రజాశక్తి అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంది. విజయవాడ కేంద్రంగా ప్రచురణ కేంద్రం ఉంది. అప్పట్లో మండలాలకు విలేకరులు లేరు. పత్రికల వ్యాప్తి పెరిగాక ప్రజాశక్తి కూడా వాటికి అనుగుణంగానే అభివృద్ధి చెందుతూ వచ్చింది. 1980 దశకంలో కొన్ని ప్రాంతాల్లోనే విలేకర్లు ఉన్నారు. ఆర్టీసీ బస్సులకు కవర్లు ఇచ్చి విజయవాడకు వార్తలు పంపితే అక్కడ నుంచి ప్రింటింగ్ వేసి.. పత్రికను రైళ్లలో జిల్లాకు పంపేవాళ్లు. వాటిని గ్రామాలు, పట్టణాల్లో ఏజెంట్లు ప్రజలకు అందించడం జరిగేది. 1990 దశకంలో పత్రిక అభివృద్ధికి మరింత వేగంగా అడుగులు పడ్డాయి. 1995 కాలంలో జిల్లా పేజీలు ఏర్పాటు జరిగింది. జిల్లాకు రెండు ప్రధాన పేజీలు కేటాయించి ప్రకాశం జిల్లా వార్తలకు ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో ప్రజల్లో ఆదరణ పెరిగింది. స్థానిక వార్తలు ఇవ్వడంలో ప్రధాన పత్రికలతో పాటు పోటీలో నిలిచింది. దీంతో విలేకర్లు పెరిగారు. మండలాలకు విస్తరణ జరిగింది. 1998లో ఒంగోలులోనే కంప్యూటర్, ఇతర సౌకర్యాలతో పీసీ సెంటర్ ఏర్పాటు జరిగింది. దీన్ని అప్పటి సంపాదకులు కామ్రేడ్ మోటూరి హనుమంతరావు ప్రారంభించారు. అప్పటి నుంచీ వార్తలు సేకరణ, జిల్లా కేంద్రానికి చేర్చే ప్రక్రియ సులభతరం అయింది. పత్రిక అన్ని మండలాలకూ వెళ్లడం ఆరంభమైంది. ఉమ్మడి ప్రకాశంలో 56 మండలాల్లో పత్రిక చందాదారులను సంపాదించుకుంది. పత్రికలో వార్తలు అవసరాలు పెరిగాయి. వివిధ వర్గాల నుంచీ, శ్రేయోభిలాషుల నుంచీ వార్తలు, సమాచారం ఇంకా పెరగాలనే ఒత్తిడి పెరిగింది. దీంతో ఇంకో ముందడుగు వేసింది. 2004-05 కాలంలో జిల్లా టాబ్లాయిడ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. 8 పేజీలతో ▶ 7లో

నాగార్జున సాగర్ కుడి కాలువ

రెండో దశ పనుల కోసం ఉద్యమం

తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు

ప్రజాశక్తి-పొదిలి

రెండవ సారి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వైఎస్ .రాజశేఖర్ రెడ్డి బ్రతికి ఉంటే నాగార్జున సాగర్ కుడి కాలువ రెండో దశ పనులు ప్రారంభమ య్యేవని పొదిలి ఎంఎంసి మాజీ చైర్మన్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు తెలిపారు. 2004లో రాజశేఖర్ రెడ్డి హయాంలో ఈ ప్రాంతంలో నీటి ఎద్దడి, కరువు కాటకాల నివారణ కోసం, 2007లో సాగర్ కుడి కాలువ రెండవ దశ కోసం నెల్లూరు జిల్లా ఉదయగిరి చెందిన మాజీ మంత్రి మాదాల జానకిరామ్ ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. గతంలో కుడికాలువ పొడిగింపు సమయంలో పనులు ఆగిపోయిన జిల్లాలోని కురిచేడు స్ట్రయిట్ కట్ వద్ద నుంచి జానకిరామ్ పాదయాత్ర చేసినట్లు తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిని జానకిరామ్‌తో కలిసి అఖిలపక్షం నాయకుడిగా తాను కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాదాల జానకిరామ్‌ను ముఖ్య మంత్రి సాదరంగా ఆహ్వానించి ఈ ప్రాంత నీటిసమస్య, గతంలో జరిగిన అన్యాయంపై చర్చించినట్లు తెలిపారు. జలయజ్ఞంలో ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఎకరాకు రూ.10,000 నుంచి రూ.50000 ఖర్చుపెడుతున్న దశలో ఇక్కడ (కుడి కాలువ పొడిగింపులో) ఈ ప్రాజెక్టు ద్వారా కేవలం గ్రావిటీ మీద నీరు మళ్లించవచ్చని తెలిపారన్నారు. కేవలం ఎకరాకు రూ. 500 మాత్రమే ఖర్చవుతుందని, ఎత్తిపోతల పథకాలు, డీప్ కట్లు లేకుండానీరు ప్రవహిస్తుందని జానకిరామ్ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డికి సవివరంగా తెలియజేసినట్లు తెలిపారు. దీనిపై రాజశేఖర్ రెడ్డి స్పందించి మరింత సమగ్రంగా చర్చించేందుకు సాయం త్రం మరోసారి సమావేశం కావాలన్నారు. అదే రోజు సాయంత్రం ముఖ్యమంత్రి వైఎస్ఆర్, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను పిలిపించి మరోసారి ఈ సమస్యపై తీవ్రంగా వారితో చర్చించారన్నారు. గతంలో సాగర్ నిర్మాణం సందర్భంగా ఈ ప్రాంతానికి అన్యాయం, దశాబ్దాలుగా జరుగుతున్న నిర్లక్ష్యంపై జలవనరుల అధికారులు ఆయనకు వివరించడంతో ఈ ప్రాంతానికి అన్యాం జరిగిందని ఆయన ఒప్పుకున్నారన్నారు. ఫ్లోరిన్ సమస్యతో పాటు ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాజెక్టును తాను త్వరలో ప్రారంభిస్తానని సిఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగానే 2009 ఎన్నికల ప్రచారం సందర్భంగా కందుకూరులో జరిగిన బహిరంగ సభలో మరోసారి తనకు అధికారం ఇస్తే నాగార్జున సాగర్ కుడికాలువ రెండో దశ పనులు ప్రారంభిస్తానని రాజశేఖర్ రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలిపారు. రెండోసారి ముఖ్యమంత్రి అయిన తరువాత అనుకోకుండా హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్ఆర్ మరణంతో ఈ అంశం మరుగున పడినట్లు తెలిపారు. తర్వాత రాష్ట్ర విభజన ఇతర అంశాలతో ఈ సమస్యపై స్పందించే వారే లేక పోవడం దురదష్టకరమని శ్రీనివాసులు తెలిపారు. తాజాగా నదుల అనుసందానం అంశం తెరపైకి వస్తుండటంతో దీనిపై మరోసారి ఉద్యమం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రైతుసంఘం ఆధ్వర్యంలో త్వరలో ఈ ప్రాజెక్టు ప్రాధాన్యత అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసేందుకు సిద్ధ పడుతున్నట్లు ఆయన తెలిపారు.

పొదిలిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

మాజీ సర్పంచి నారాయణ ప్రతాప్

కాటూరి నారాయణ ప్రతాప్

ప్రజాశక్తి-పొదిలి

గత ప్రభుత్వం ప్రకటించినట్లు పొదిలిని రెవెన్యూ డివిజన్ కేంద్రం నూతన ప్రభుత్వం ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచి, మాజీ మంత్రి కాటూరి నారాయణ స్వామి కుమారుడు కాటూరి నారాయణ ప్రతాప్ కోరారు. పొదిలి కేంద్రంగా గతంలో నియోజవర్గం ఉందన్నారు. నియోజకవర్గం కేంద్రం ఏర్పాటుతో పాటు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయదగిన విధంగా నేడు పొదిలి ఏర్పడిం దన్నారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేస్తామని హమీ ఇచ్చారన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాను రెండు జిల్లాలుగా విభజించడం ద్వారా ప్రజలందరికీ పరిపాలనా సౌలభ్యం కలుగుతుందన్నారు. అందులో భాగంగా పొదిలి కేంద్రంగా రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసి ఇటు దర్శి నియోజకవర్గం, ఆటు కనిగిరి నియోజకవర్గ ప్రజలకు పొదిలి అందు బాటులో ఉంటుందన్నారు. రెవెన్యూ డివిజన్ తోనే నియోజకవర్గం ఏర్పాటుకు ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. 2026 నియోజక వర్గాల పునర్విభజనలో పొదిలి కేంద్రంగా మళ్లీ కొత్త నియోజకవర్గం ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్త చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో భౌగోళికంగా ఎటు చూసినా జిల్లా నడిబొడ్డున ఉన్న పొదిలి భవిష్యత్తు కోసం అవసరమైతే ఉద్యమిస్తామన్నారు. దర్శి, కనిగిరి ప్రాంతాల ప్రజలు, నాయకులు కూడా విజ్ఞతతో ఆలోచించి పొదిలి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మద్దతు తెలపాలన్నారు.



నూతన సంస్కరణలతో

కనుమరుగైన కందిపప్పు మిల్లులు

ఉపాధి కోల్పోయిన కార్మికులు

ప్రజాశక్తి-పొదిలి

1991లో సంస్కరణల పేరుతో కేంద్ర.రాష్ట్ర ప్రభుత్వాల అవలంబించిన విధానాల తీరుతో పొదిలిలో కంది కంది పప్పు మిల్లు మూత పడ్డాయి. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు సైతం భారీగా కందిపప్పును ఎగుమతి చేసిన పొదిలి ప్రాంతం నేడు ఆ ప్రాభవాన్ని కోల్పోయింది. కార్మికులు ఉపాధి కోల్పోయారు.

ఒకప్పుడు పొదిలి కేంద్రంగా రాష్ట్రం నలుమూలలకి కంది పప్పు సరఫరా జరిగేది. 1996 వరకూ రాష్ట్రంలోనే కందిపప్పు సరఫరాలో పొదిలి అగ్రభాగంగా నిలిచింది. ప్రకాశం జిల్లా ఏర్పాటు నాటికి ఏ మాత్రం సాగునీటి వనరులు లేని ఈ ప్రాంతంలో అపరాల సాగు బాగా ఉండేది. పొదిలి కేంద్రంగా కనిగిరి, మర్రిపూడి, కొనకనమిట్ల, దర్శి, తాళ్లూరు ప్రాంతాల రైతులు కంది పంట సాగు చేసేవారు. దీంతో కంది పప్పుమిల్లుల నిర్మాణం పెరిగింది. మెట్ట ప్రాంతం కావడంతో నాణ్యమైన కందిపప్పుతో పాటు ఇక్కడి వ్యాపారులపై నమ్మకంతో రాష్ట్రం నలుమూలల నుంచి ఆర్డర్లు రావడంతో డిమాండ్ బాగా పెరిగింది. 1976 జూన్ 3న గోపాలకష్ణ డాల్ అండ్ ఫ్లోర్ మిల్ పేరుతో ఓ మిల్లును ప్రారంభించారు. అనంతరం వందలాది మంది కూలీలకు ఉపాధి దొరకడంతో పాటు లాభదాయకంగా మారి 17 మిల్లులను నిర్మించారు. 1990లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల ప్రభావంతో విదేశీ వస్తువుల దిగుమతి ప్రారంభంతో కందిపప్పు మిల్లు పూర్తిగా కనుమరుగయ్యాయి. విదేశీ వస్తువుల దిగుమతి సందర్భంగా ఢాకా, బర్మా, కెన్యా దేశాల నుంచి అక్కడి రైతులు పండించిన కందులను తక్కువ ధరకు దిగుమతి చేసుకోవడంతో ఇక్కడ సంక్షోభం ప్రారంభమైంది. దేశవాళి కందులకు అప్పట్లో మార్కెట్ రేటు క్వింటా రూ.600 ఉండగా విదేశీ కందులు రూ.550 దిగుమతి అయ్యేవి. ఇలా ఇతర దేశాల కందులు మన మార్కెట్ ముంచెత్తడంతో ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు ఆర్డర్లు నిలిచిపోయాయి. దీంతో రైతుల వద్ద పండిన కందుల కొనుగోలు తగ్గిపోయింది. పంట వేసిన రైతులు నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. వ్యాపారలకు ఎగుమతులు లేక దివాళా తీసే స్థితి ఏర్పడింది. ఈ 20 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల వ్యాపారం జరిగింది. ఇక్కడి వ్యాపారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, లైసెన్స్‌ల కోసం ఒంగోలు వెళ్లకుండా ప్రభుత్వం ఇక్కడే సిటిఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఈ పరిస్థితిలో ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉన్న పొదిలి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ కూడా ఏర్పాటు చేయాలనే డిమాండ్ వచ్చింది. 1996 నాటికి ఈ పరిస్థితి మరింత దిగజారి మిల్లులు మూసివేత దిశగా పయనించాయి. వీటిని నమ్ముకుని వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోవడంతో వారు ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. కందులకు అనుబంధంగా ఉన్న ఇతర వ్యాపారాలు దెబ్బతినడంతో సంక్షోభంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిటిఓ కార్యాలయాన్ని మార్కాపురం తరలించారు. గతంలో ఏడాది పొడవునా కార్మికులకు ఉపాధితో పాటు వ్యాపారులకు చేతినిండా పని, ఆదాయం ఆర్జించి పెట్టే కందిపప్పు మిల్లులు ప్రస్తుతం ఒకటి రెండు మినహా అన్ని మూతపడ్డాయి. కేవలం రూ.50 తక్కువకు ఇతర దేశాల కందిపప్పు లభిస్తుందని ఆశించిన మన దేశీయ కందిపప్పుకు కళ్లెం వేసిన పాలకులు ఇక్కడి పరిశ్రమలను నాశనం చేశారు. సంస్కరణల పేరుతో పొరుగింటి పుల్లకూర తీపిచందంగా ప్రభుత్వాల తీరుతో వేలాది మంది కార్మికుల ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆర్థికంగా నష్టం జరుగుతోంది. ఈ సంస్కరణలను నాటి ప్రధాని పివి. నరసింహారావు హయాంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టింది. నేటి మోడీ సారథ్యంలో బిజెపి కూడా అదేబాట పయణిస్తుంది. దీంతో కార్మికులు, ప్రజలు రోడ్డున పడాల్సి వస్తుంది.

మూత పడిన కందిపప్పు మిల్లు



అంచలంచెలుగా ఎదిగిన 'గునుపూడి'

నాలుగు దశాబ్ధాలకు పైగా టిడిపికి విశేష సేవలు

ప్రజాశక్తి-పొదిలి

గునుపూడి భాస్కర్ అంటే తెలియని వారు ఉండరు.. ఉమ్మడి ప్రకాశం జిల్లా మొదలు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్య సంఘంలో కీలకమైన వ్యక్తిగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక నాయకుడిగా, కష్టకాలంలో పార్టీని నడపడంలో ముందున్న భాస్కర్ పొదిలి పట్టడానికి చెందినవారు. సుమారు 42 సంవత్సరాలుగా టిడిపికి విశేష సేవలందిస్తూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కార్యకర్తలైనా, పేదలైనా, ఎవరికైనా తన చేతనైనంత సాయం అందిస్తూ ప్రజలలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పొదిలికి చెందిన మాజీ మంత్రి కాటూరు నారాయణస్వామికి ప్రియ శిష్యుడు గునుపూడి భాస్కర్. నారాయణ స్వామి స్ఫూర్తితో 1982లో భాస్కర్ టిడిపిలో చేరారు. అంచలంచెలుగా ఎదుగుతూ నేడు రాష్ట్ర కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి నేనున్నానంటూ... ఆపన్న హస్తం అందిస్తూ... సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజల చేత శభాష్ భాస్కర్ అనిపించుకుంటున్నారు.పొదిలి తాలూకాలో అడుగడుగునా ప్రత్యేక ప్రజాదరణ పొందిన నాయకుడిగా గుర్తింపు పొందిన భాస్కర్ పదవులు ఉన్నా, లేకున్నా సేవా తత్పరతలో ప్రత్యేకతను చాటుకుంటున్నారు. రాజకీయాలలో ఈ ప్రాంతంలో నిస్వార్థ ప్రజా సేవకు నిలువుటద్దంగా గుర్తింపు పొందిన గురువర్యులు మాజీ మంత్రి కీర్తిశేషులు కాటూరి నారాయణ స్వామి అడుగుజాడల్లో నడుస్తూ టిడిపి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో పొదిలి ప్రాంతం అటు దర్శి, ఇటు మార్కాపురాలకు మారిన ఎన్నికల పోటీ చేసే అభ్యర్థుల విజయానికి భాస్కర్ పార్టీలో అలుపెరగని బాటసారిలా పనిచేస్తున్నారు. కాటూరి

పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న గునుపూడి భాస్కర్ (ఫైల్)

చంద్రబాబు నాయుడుతో గునుపూడి భాస్కర్

నారాయణస్వామి తర్వాత దర్శి నియోజకవర్గంలోని పొదిలి ప్రాంతంలో 1999లో వేమా సుబ్బారావు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లాల్ జాన్ బాషా విజయం కోసం అప్పట్లోనే తన ఆస్తులను అమ్మి ఎన్నికల్లో ఖర్చు పెట్టారు. ఎన్నికల నిర్వహణకు వచ్చిన ఆదాల ప్రభాకర్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, భాస్కర్ సేవలను గుర్తించి ప్రత్యేకంగా అభినందించారు. అదే సమయంలో సమయంలో ఎన్నికల ప్రచారానికి పొదిలికి వచ్చిన చంద్రబాబు నాయుడు భాస్కర్ సేవలను గుర్తించి తన ప్రచార చైతన్య రథం పైకి ఆహ్వానించారు. రాష్ట్రంలో పార్టీ అధికారం లేకపోయినా 2007 నుంచి 2014 వరకు పొదిలి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా కొనసాగారు. టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి విగ్రహాన్ని పొదిలి పెద్ద బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసేందుకు భాస్కర్ సుమారు ఏడు లక్షల సొంత నిధులు ఖర్చు చేశారు. ఎన్టిఆర్ తనయుడు, సినీ నటుడు నందమూరి బాలకష్ణను పొదిలికి రప్పించి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా కోడ ఉల్లంఘించాడనే నెపంతో అధికార పార్టీ నాయకులు కేసులు పెట్టి భాస్కర్‌ను టిడిపి కార్యకర్తలను సుమారు ఐదు సంవత్సరాల పాటు కోర్టుల చుట్టూ తిప్పారు. 2014లో ఎంపిపి ఎన్నికలు రాగా పొదిలి పట్టణంలోని 5వ ఎంపీటీసీ స్థానానికి ఆయన సతీమణి గుడిపూడి మాధవిని పోటీ చేయించి అఖండ మెజార్టీతో, మండలంలోనే అత్యధికంగా 1250 ఓట్లతో గెలిపించుకుని నియోజకవర్గంలోనే రెండవ స్థానంలో నిలిచారు. గత. ఎన్నికలకు ముందు 'ఇదేమి కర్మ మన రాష్ట్రానికి' అనే కార్యక్రమానికి చంద్రబాబు నాయుడు మార్కాపురం పర్యటన, యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ పొదిలి కార్యక్రమాల విజయవంతానికి లక్షలాది రూపాయలు వెచ్చించి ఖర్చు చేశారు. పట్టణంలోని రథం రోడ్‌లో భాస్కర్ ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద నారా లోకేష్‌కు పలికిన ఘన స్వాగతం వారిరువురి జీవితాలలో చిరస్థాయిగా గుర్తుండిపోయే రోజు. మొన్నటి జనరల్ ఎన్నికల్లో మార్కాపురం ఎమ్మెల్యేగా కందుల నారాయణరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాస్ రెడ్డి విజయానికి గునుపూడి విశేష కృషి చేశారు. కందులకు ప్రత్యర్థిగా పోటీ చేస్తున్న వైసిపి అభ్యర్థి, ఆర్యవైశ్య వర్గానికి చెందిన అన్నా రాంబాబుకు దీటుగా 'కులం కూడు పెట్టదు' అని నిరూపించే విధంగా పొదిలి పట్టణంలో ఆర్యవైశ్యులను ఏకం చేసి ప్రత్యేకంగా ఆర్యవైశ్య ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంకుశ వైసిపి ప్రభుత్వం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అవసరాన్ని గుర్తు చేశారు. నియోజకవర్గంలో ఆర్యవైశ్యులకు అండదండగా ఉంటున్న కందుల నారాయణ రెడ్డి పోరాట పటిమను గుర్తు చేస్తూ, జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడుతున్న మాగుంట శ్రీనివాస రెడ్డి ప్రాధాన్యతలను వివరిస్తూ పట్టణ ఆర్యవైశ్యులను ఏకం చేయడంలో ఆయన సఫలీకృతులయ్యారు. నాడు, నేడు జిల్లా పార్టీ అధ్యక్షులుగా తనను ప్రోత్సహిస్తున్న దామచర్ల జనార్ధన్, నూకసాని బాలాజీల సహాయ సహకారాలతో భవిష్యత్తు టిడిపి అవసరాన్ని వివరించారు. పొదిలి పట్టణంలో ఆర్యవైశ్య సంఘం వ్యవస్థాపకులైన తన తండ్రి కీర్తిశేషులు గునుపూడి సుబ్బారావు గారు చేసిన సేవలను గుర్తు చేస్తూ ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించారు. పార్టీ పరంగా తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడిగా, మార్కాపురం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులుగా, జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆర్యవైశ్య సామాజిక వర్గం పరంగా పట్టణ మండల అధ్యక్షులుగా, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. కుటుంబ సభ్యులతో కలిసి పలు

కుటుంబ సభ్యులతో గునుపూడి భాస్కర్

నారా లోకేష్‌తో గునుపూడి భాస్కర్

సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. భాస్కర్ తండ్రి గునుపూడి సుబ్బారావు ఆధ్వర్యంలో అప్పట్లో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నిర్మాణం మరియు అన్ని కులాల వారికి ఉపయోగపడేలా వాసవీ కళ్యాణ సదన్‌ను నిర్మించారు. భాస్కర్ సారథ్యంలో వారి సోదరులు గునుపూడి చెంచు సుబ్బారావు, మధుసూధన్ రావు ప్రోత్సాహంతో పొదిలి పట్టణంలో కోదండ రామాలయాన్ని, అంకాల పరమేశ్వరి ఆలయం నిర్మించారు. పట్టణంలో బాటసారులకు సత్రాన్ని, కుంచేపల్లి ఎస్‌సికాలనీ వద్ద ప్రయాణికులకు విశ్రాంతి శాల నిర్మించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు పట్టణంలో అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు పేరుతో ఉన్నత పాఠశాల భవనాన్ని నిర్మించి ఇచ్చారు. సరస్వతీ శిశు మందిర్ పాఠశాల నూతన నిర్మాణానికి సుమారు రూ. 50 లక్షల విలువైన స్థలాన్ని ఇచ్చి తన దాతత్వం చాటుకున్నారు. భాస్కర్‌రావు సోదరుడు గునుపూడి చెంచు సుబ్బారావు ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల అధ్యక్షులు మరియు కరస్పాండెంట్‌గా ఈ ప్రాంత పేద విద్యార్థుల ఉన్నత విద్యాభివద్ధికి పాటుపడుతున్నారు. ప్రతి ఏడాది వేసవిలో తన తల్లిదండ్రులు గునుపూడి సుబ్బారావు లక్ష్మితాయారమ్మ పేరుతో భాస్కర్ పొదిలి పెద్ద బస్టాండ్ సెంటర్లో 24 గంటలు కూలింగ్ మినరల్ వాటర్‌తో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. పొదిలి పట్టణంలో ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పదివేల మంది భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. నిత్యం కరువు కాటకాలు, దశాబ్దాలుగా అభివృద్ధికి నోచని పొదిలి ప్రాంతంలో పార్టీ పరంగా ఇటు కార్యకర్తలకు, ఆటు ప్రజలకు ఇంతటి విశేషమైన ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గునుపూడి భాస్కర్‌కు భవిష్యత్తులో రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి చేరుకునేందుకు తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పోస్టు ఇవ్వాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

44 ప్రజాశక్తి

వార్షికోత్సవ శుభాకాంక్షలు

1942లో స్వాతంత్ర్య పోరాట ఉద్యమ పత్రికగా ప్రారంభమై పాలకులు నిషేధానికి గుర్రై 1968లో వార పత్రికగా పునరుద్ధరించబడి, 1981నుండి దినపత్రికగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో విశేష ప్రజాదరణ పొంది, బాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కట్టుబడిఉన్న ఏకైక దినపత్రికగా తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకుని, "ప్రతిఅక్షరం-ప్రజల పక్షం" నినాదంతో 44వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా ప్రజాశక్తి యంత్రాంగానికి, క్షేత్రస్థాయిలో పని చేస్తున్న పాత్రికేయ మిత్రులకుఇవేమా హృదయ పూర్వక శుభాకాంక్షలు...

ప్రజాశక్తి అభిమానులు

తాలూకా ఆఫీస్ వీధి,

పొదిలి, ప్రకాశం జిల్లా.

44 ప్రజాశక్తి

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

శ్రీ వివేకానంద విద్యాసంస్థలు - పొదిలి

సమాజ శ్రేయస్సు కోసం,
సాంఘీక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడుతూ,
సమకాలీన సమస్యల పరిష్కారానికి నిరంతరం
అక్షర సమరం సాగిస్తున్న ప్రజల పత్రిక
ప్రజాశక్తి దినపత్రిక ప్రజలకు మరింత
బాసటగా నిలవాలని, ప్రగతి పథాన
పయనించాలనిఆకాంక్షిస్తూ . . .
పొదిలి ప్రాంత ప్రజలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు,
అధికారులకు, ప్రజాశక్తి పాత్రికేయ మిత్రులకు
ఇవే మా హృదయ పూర్వక శుభాకాంక్షలు. ...

కసిరెడ్డి వెంకట రమణారెడ్డి
డైరక్టర్, శ్రీవివేకానంద విద్యాసంస్థలు

యేలం వెంకటేశ్వరరావు
డైరక్టర్, శ్రీవివేకానంద విద్యాసంస్థలు

పొదిలిలో ట్రాఫిక్ ఇక్కట్లు

వాహన చోదకులకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రంగా మారుతోంది. దీంతో పట్టణ ప్రజలతో పాటు పశ్చిమ ప్రకాశం వాహణ చోదకులు ఆందోళన చెందుతున్నారు. ట్రాఫిక్ సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లాకు వచ్చిన ప్రతి పోలీస్ బాస్ సిబ్బందిని ఆదేశిస్తారు. ప్రజల కోసం పోలీసులు అన్ని ఫర్‌ఫెక్ట్‌గా చేయాలని ఆదేశించినా సరిపడా సిబ్బంది లేక అవస్థలు తప్పడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకువెళ్ల లేరు. దీంతో ఇక్కడి పోలీసుల పరిస్థితి కుడితో పడ్డ ఎలుకలా తయారైంది. ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన వారి తిట్లు భరిస్తూ దులుపుకుపోతున్నారు. పొదిలి పోలీస్‌స్టేషన్‌లో సరిపడా సిబ్బంది లేదు. రోజు ట్రాఫిక్ సమస్యలు మొదలు ప్రమాదాలు నివారణ, డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు ట్రాఫిక్ సమస్యలు సిబ్బందిని వెంటాడుతున్నాయి. ఈ ప్రభావం పట్టణ ప్రజలపై తీవ్ర ఒత్తిడి పెంచుతోంది. ప్రతినిత్యం పొదిలి పట్టణం ద్వారా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. సుమారు మూడు దశాబ్దాలుగా భారీగా పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా రహదారుల విస్తరణ లేక ప్రజలు దుమ్ము ధూళితో సహాజీవనం సాగిస్తున్నారు. ఎక్కడిక్కడ రహాదారుల ఆక్రమణతో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం కలుగుతోంది. దీన్ని నియంత్రించడంలో పోలీస్ అధికారులు, నగర పంచాయతీ, రెవెన్యూ, రహదారులు భవనాల శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. సుమారు 15 సంవత్సరాల క్రితం ఇక్కడ పనిచేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ మేజర్ పంచాయతీగా ఉన్న అప్పటి గ్రామ పరిస్థితిని ముందుగానే అంచనా వేసి ప్రధాన రహదారితో పాటు జూనియర్ కాలేజి రోడ్డు, తాలూకా ఆఫీస్ వీధి, చిన్నబస్టాండ్ నుండి పెద్ద బస్టాండ్ వరకు వన్‌వే ఏర్పాటు, ఇరత రహదారుల ఆక్రమణలను ఆప్పట్లో జేసిబితో తొలగించారు. ఆక్రమణ తొలగింపు అప్పట్లో వివాదంవగా మారింది. రద్దయిన పశ్చిమ ప్రాంత నియోజకవర్గ ఎమ్మెల్యే ఒకరు స్థానిక విశ్వనాధపురం సెంటర్ వద్ద దుకాణాల ముందు ఉన్న ఆక్రమణల తొలగింపుపై సిఫారసులు సైతం లెక్కచేయకపోవడం ఆయనకు ప్రజల్లో మంచి గుర్తింపు వచ్చింది. సిఐ శివ ప్రసాద్, ఉద్యోగులు తమ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని ఆయన గుర్తు చేశారు. అప్పట్లో ఆయనకు పంచాయతీ, రహదారులు భవనాల శాఖ అధికారులు పూర్తిగా సహకరించడంతో కొద్ది సంవత్సరాల పాటు ట్రాఫిక్ సమస్య తొలగిపోయింది. అనంతరం సిఐ శివప్రసాద్ వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లారు. దీంతో మళ్లీ రోడ్డు ప్రక్కమార్జిన్లు ఆక్రమణకు గురయ్యారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ప్రసుత ఆర్‌అండ్‌బి డిఇగా ఉన్న శ్రీకృష్ణ గత టిడిపి ప్రభుత్వం హయంలో రహదారి ప్రక్కన పోసిన మట్టిని తొలగించి కొంత మేర ట్రాఫిక్ సమస్యను నివారించారు. ప్రస్తుతం రహదారులకు ఇరువైపుల ఉన్న దుకాణదారులకు మట్టి తోటి చదును చేశారు. దీంతో మళ్లీ ట్రాఫిక్ కష్టాలు తప్పవడం లేదు. 2020లో పొదిలి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన అప్పటి జిల్లా ఎస్‌పి సిద్దార్ కౌశిల్ పొదిలి సమస్యలపై మీడియాతో మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య జఠిలమవు తోందని దీని నివారణకు ఇక్కడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు ఒక్కటే మార్గమని అందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అది అమలుకు నోచలేదు. తాజాగా నూతన ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన పోలీస్ బాస్ పొదిలికి వచ్చిన సందర్భంగా ట్రాఫిక్ సమస్యలపై విచారించారు. సిబ్బంది కొరతపై స్పందించకపోవడంతో సమస్యలు ఏవిధంగా పరిష్కరించాలో అర్ధం కాక స్థానిక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఉన్న కొద్దిపాటి సిబ్బదిలో కొందరు, కోర్టు పనులు, మరికొందరు కేసుల విచారణ నిమిత్తం, మరికొందరు ఇతర పనులపై బయటకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో ట్రాఫిక్‌ను నియంత్రణకు ఇబ్బందిగా మారుతుంది. పోలీసు సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించి ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహన చోదకులు

రహదారిపై మట్టితోలుతున్న దృశ్యం

రహదారిపై చేరిన నీరు

రహదారిపై చేరిన వర్షపు నీరు

కాలువలను తలపిస్తున్న రోడ్లు

- చిన్నపాటి వర్షానికే నీటి గుంతలను తలపిస్తున్న ఆర్‌అండ్‌బి రహదారులు
- రాకపోలకు ప్రజలకు అవస్థలు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలోని రహదారులు పంట కాలువలను తలపిస్తున్నాయి. కొద్దిపాటి వర్షానికే ప్రధాన రహదారితో పాటు పలు కూడళ్ల నీరు నిలిచి ప్రయాణికులు, పాదచారుల రాకపోకలకు తీవ్ర అంత రాయంగా మారతున్నాయి. ప్రధాన రహదారికి ఇరువైపుల మట్టి కుప్పలు, నీటి గుంతలు, రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోతుంది. చిన్న బస్టాండ్, ఒంగోలు రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద నుంచి పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు రథం రోడ్డు, శివాలయం సెంటర్, పాత ఫోస్టాఫీస్ సెంటర్, విశ్వనాధపురం, ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్, జహంగీర్ బాషా బజార్, కరుణ గ్యాస్, మండల పరిషత్ కార్యాలయం, కళ్యాణి రెస్టారెంట్, హైదరాబాద్ లాడ్జీ, మార్కాపురం అడ్డరోడ్డు వరకూ రహదారి పొడవునా నీరు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షం పడకపోయినా సమయాల్లో కూడా రహదారి ప్రక్కన మట్టి కుప్పలు, రోడ్డుపైన ఉన్న దుమ్ము, ధూళితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షం పడిన సమయంలో ప్రయాణికుల బాధలు వర్ణణాతీతం.

ఆర్‌అండ్‌బి ఉన్నట్లా లేనట్లా ...?

గత కొద్ది సంవత్సరాలుగా పొదిలిలో ఆర్‌అండ్‌బి శాఖ అధికారులు ఉన్నారో లేదో కూడా తెలియడంలేదు. నిన్న మొన్నటి వరకు రాష్ట్ర రహదారులు భవనాల శాఖమంత్రిగా శిద్దా రాఘవరావు ఉన్న సమయంలో ఇక్కడ ఆర్‌అండ్‌బి డిఇఇ కార్యాలయం ఉంది. అధికారులు మాత్రం దర్శి కేంద్రంగా పపనిచేశారు. కేవలం బిల్లులు చేయడానికి, జీతాలు తీసుకోవడానికే అన్నట్లు ఉన్న ఈ కార్యాలయం పొదిలి పరిధిలోని రహదారుల భద్రతను గాలికివదిలేశారు. వ్యాపారస్తులు, దుకాణాల నిర్వాహణకులు ప్రధాన రహదారిని ఆక్రమించి రెండు మూడు అడుగుల వరకు మెరక తోలుతున్నా ఇక్కడ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. శిద్దా పదవి ముగిసినప్పటికీ ఆర్‌అండ్‌బి అధికారులు డివిజన్ కేంద్రంగా ఉన్న పొదిలి పట్టణంలో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకున్న దాఖాలు లేవు. జిల్లా భౌగోళికంగా కేంద్రంగా ఉన్న పొదిలి పట్టణంలోకి ప్రతి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అవకాశవాద అధికార పార్టీ నాయకులు పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న కార్యాలయం ఉనికి కోసమైనా ఆర్‌అండ్ బి అధికారులు రోడ్లను అభివృద్ధి చేయకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు.

వర్షానికి గుంతల మయంగా మారిన రహదారి

అభివృద్ధికి నోచని గ్రామీణ రహదారులు

రాకపోకలకు ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి మండలం అభివృద్ధికి నోచలేదని చెప్పడానికి ఉదాహరణగా గ్రామీణ రహదారులు దర్శనమిస్తున్నాయి. గతంలో కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టించేందుకు రాజీవ్ పల్లె బాట కార్యక్రమం పేరుతో రహదారుల నిర్మాణం చేపట్టారు. అవిపూర్తి ఇప్పటికీ పూర్తి కాలేదు. అసంపూర్తిగా మిగిలిపోయాయి. 2004లో మొదటిసారి కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కుంచేపల్లికి వాచ్చరు. ఆ సమయంలో గురవాయపాలెం నుంచి రాములవీడు గ్రామానికి, దాసర్లపల్లి నుంచి కాశీపురం గ్రామానికి తారు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పొదిలి - దర్శి రోడ్డు నుంచి అక్కచెరువు, సూదనగుంట, తుమ్మగుంట, రామాపురం, వెలిగండ్ల గ్రామాల మీదుగా మండలంలోని శివారు గ్రామం, ఈగల పాడు వరకూ చేపట్టిన తారు రోడ్డు నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. అప్పటినుండి నేటి వరకు సుమారు రెండు దశాబ్దాల కాలంలో ఈ రహదారిలో

అధ్వానంగా తయారైన వెలిగండ్ల-ఈగలపాడు రహదారి

ఎలాంటి పురోగతి లేదు. గురవాయపాలెం రాముల వీడు రహదారి నిర్మాణానికి కేటాయించిన నిధులను మళ్లించడంతో పనులే ప్రారంభం కాలేదు. రెండవసారి ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎన్నికైన తరువాత ఆయన మరణం, అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు, రాష్ట్ర విభజన నేపథ్యంలో అభివృద్ధి పనులకు గ్రహణం పట్టింది. రాష్ట్ర యువజన తర్వాత కొత్తగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన పెద్దగా నిధులు మంజూరైన పరిస్థితులు లేదు. 2004లో దర్శి నియోజకవర్గ పరిధిలోని పొదిలి మండలంలోని గ్రామాలలో ముఖ్యంగా పొదిలి దర్శి రోడ్డు నుంచి బుచ్చన పాలెం, నిమ్మవరం ఆముదాలపల్లి మీదుగా అన్నవరం వరకూ నిర్మించిన తారు రోడ్డు తప్ప మిగిలిన ఏ రోడ్లు పూర్తి కాలేదు. టిడిపి ప్రభుత్వం హయాంలో ఒంగోలు పొదిలి రోడ్ లోని అగ్రహారం గ్రామం నుంచి అన్నవరం వరకూ తారు నిర్మించారు. అనంతరం వైసిపి అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మండలంలోని రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. రాష్ట్ర అభివృద్ధిలో కీలకమైన రహదారులకు అధిక ప్రాధాన్యత ఇచ్చే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మండలంలో గ్రహణం పట్టిన రహదారులకు ఈ సారైనా మహర్దశ కలుగుతుందా అని గ్రామీణ ప్రజలు చర్చించుకుంటున్నారు. రెండు దశాబ్దాల కాలంలో రెండు సార్లు టిడిపి మూడుసార్లు కాంగ్రెస్, వైసిపి అధికారంలో ఉన్నా ఈ గ్రామీణ రహదారులకు తగిన ప్రధాన ఇవ్వక పోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలతో నరకయాతన మధ్య ప్రయాణాలు సాగిస్తున్నారు. గుంతలు పడిన రోడ్లు, కంకరలేసిన మట్టి, అసంపూర్తిగా మిగిలిన తారు రోడ్లులో బస్సు సౌకర్యం లేక ఆటోలు, ద్విచక్ర వాహనాల ప్రయాణం అడుగడుగునా ప్రమాదకరంగా మారింది. అసంపూర్తిగా మిగిలిపోయిన వెలిగండ్ల-ఈగలపాడు రహదారిలో టిడిపి ప్రభుత్వంలో నిధులు విడుదల కాలేదు. వైసిపి ప్రభుత్వం కొంత నిధులు కేటాయించినప్పటికీ రహదారి నిర్మాణం పూర్తి కాలేదు.

ప్రభుత్వాలు మారినా

2004 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్న ప్రజా ప్రతినిధులుగా ఎన్నికవుతున్న నాయకుల తీరు మారలేదు. దీంతో మండలంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సందర్భంగా తయారైంది. ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్ రెడ్డి తదనంతరం రాష్ట్ర విభజన నేపథ్యంలో దర్శి, కంభం నియోజకవర్గాలలో ఉన్న పొదిలి మండలాన్ని మార్కాపురంలో కలిపేశారు. దీంతో ఈ మండలంలో కీలకమైన అభివృద్ధి పనులు కుంటు పడిపోయాయి. రాజకీయం మరింత దిగజారిపోయింది. పెన్నెంలోంచి పోయిలోపడ్డ సందర్భంగా పొదిలి అభివృద్ధిపై మార్కాపురం నాయకులు సవతి ప్రేమ ప్రదర్శిస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో రాష్ట్ర విభజన, వైసిపి ఆవిర్భావం రాజకీయ నాయకులకు గోడ గోడమీద పిల్లి ఆటలా మారింది. కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి అభివృద్ధికి పెద్దపేట వేసి ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటారని భావించి అత్యధిక మెజార్టీతో జగన్మోహన్ రెడ్డికి అధికారం అప్పగించారు. నిన్నటి ఎన్నికల్లో ఆయన డొల్లతనం ప్రజల వ్యతికతకు అర్థం పడుతుంది. అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్ళుగా భావించే ఏ పార్టీ అయినా రాష్ట్ర ప్రజల అభివృద్ధికి కీలకమైన రహదారుల విషయంలో చేస్తున్న నిర్లక్ష్యం టిడిపి హయాంలో జరగదని భావిస్తూ అసంపూర్తిగా ఉన్న రహదారులకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సుందరయ్య - కొన్ని జ్ఞాపకాలు

విజయవాడలో ప్రస్తుతమున్న విశాలాంధ్ర భవన నిర్మాణం జరిగే సందర్భంగా ఆ ప్రాంతానికి 'సుందరయ్య నగర్' అని నామకరణం చేయాలని అప్పటి పార్టీ విజయవాడ నగర కమిటీ నిర్ణయించింది. ఆ నిర్ణయాన్ననుసరించి ఆయన పేరుతో ఒక బోర్డు పెట్టి ఆ సందర్భంగా జరిగిన సభలో నాయకులు ప్రసంగించారు. ఆ వార్తను 'సుందరయ్య నగర్ ప్రారంభోత్సవం' శీర్షికతో విశాలాంధ్రలో ప్రచురించారు. ఆ వార్త పేపరులో పడిన సాయంత్రమే సుందరయ్య ఎక్కణ్ణుంచో విజయవాడ వచ్చారు. పత్రికలో ఆ వార్త చూసి ఆయనెంతో చికాకు పడ్డారు. తతిమ్మా ఎడిషన్లలో ఆ వార్త ప్రచురించవద్దని ఆయన సంపాదకవర్గాన్ని కోరారు. తర్వాత తన పేరుతో ఏర్పాటు చేసిన బోర్డును కూడా తీసివేయించారు. ఆ విధంగా ఆయన వ్యక్తి ఆరాధనాతత్వాన్ని వ్యతిరేకించి ఆనాడే తన విలక్షణమైన వ్యక్తిత్వాన్ని నిరూపించుకున్నారు. జనశక్తి దినపత్రిక ప్రారంభోత్సవం సందర్భంగా జరిగే సభ అది. హాజరైన జనం 'సుందరయ్య జిందాబాద్' అని నినాదాలు చేస్తుంటే ఆయన వారిని వారించారు. అలాంటి నినాదాలు తనకు నచ్చవనీ, తాను చనిపోయేంతవరకూ కమ్యూనిస్టుగా ఉండి విధి నిర్వహణలో మృతి చెందినప్పుడే అలాంటి పొగడ్తలు కురిపించవచ్చుగానీ.. తాను జీవించి ఉండగా జిందాబాద్ నినాదాలు ఇవ్వొద్దని ఆయన నిర్ధ్వంధంగా చెప్పారు. అలాగే తన పేరిట విగ్రహాలను వేయడాన్ని కూడా ఆయన తీవ్రంగా తప్పుపట్టేవారు. విగ్రహాలకు బదులుగా గ్రంథాలయాల వంటివాటిని స్థాపించి ప్రజల్లో చైతన్య, విజ్ఞాన కాంతులను ప్రసరింపచేయాలని కోరేవారు.

సుందరయ్యకు ఓసారి పెద్ద జబ్బు చేసింది. ఆయన మాస్కోకు చికిత్సకు వెళ్లేముందు మద్రాసు ఆసుపత్రిలో ఉంటున్న ఆయనను పరామర్శించి వీడ్కోలు చెప్పేందుకు అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి మద్రాసు వెళ్లారు. మీరు ఆరోగ్యంతో తిరిగి రావాలని తాను ఆంకాంక్షిస్తున్నాననీ, అయితే ఈ సందర్భంగా మీ కోరిక ఏమిటనీ సుందరయ్యను ప్రశ్నించారు. దీనికాయన తనకెలాంటి సదుపాయాలూ సమకూర్చవద్దనీ, తెలంగాణా పోరాటంలో పాల్గొని ఇంకా జైళ్లలో మగ్గుతున్న కమ్యూనిస్టులను విడుదల చేస్తే సంతోషించగలననీ చెప్పారు. ఈ విషయమై ఎంతోకాలంగా విన్నపాలు పంపినా పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. సుందరయ్య కోరిక మేరకు ఆనాటికి జైళ్లలో ఉన్న తెలంగాణా పోరాట యోధులందరినీ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలంగాణా వీరుడు నల్లా నరసింహులు తన ఆత్మకథలో రాసుకున్నారు.

సుందరయ్య మాస్కోలో చికిత్స పొందుతున్న సందర్భంలో జనశక్తి పత్రికలో.. ఆసుపత్రిలో ఉన్న సుందరయ్యను సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సుస్లోవ్ వచ్చి పరామర్శించారనే వార్త వచ్చింది. ఈ వార్తను సుందరయ్య మాస్కోలో చూశారు. వెంటనే అప్పటి జనశక్తి సంపాదక బాధ్యతలు చూస్తున్న బొమ్మారెడ్డికి సుందరయ్య మాస్కో నుంచి ఓ ఉత్తరం రాశారు. 'నేనుగానీ, లీలగానీ ఈ వార్తను పంపలేదు. ఇక్కడ డాక్టర్లు తదితరులు నన్ను శ్రద్ధగా చూస్తున్నారనేది వాస్తవమే. కానీ సుస్లోవ్ వచ్చి నన్ను పరామర్శించారన్నది నిజంకాదు. ఆ వార్త మీకెలా వచ్చిందో. అది సున్నితమైన అంశమిది. మన పత్రికలో ఆ పొరబాటును సరిదిద్దండి' అని ఉత్తరంలో రాశారు. సుస్లోవ్ అంతటి గొప్ప నాయకుడు తనను పరామర్శించడానికి వచ్చినా.. ఆనాటి రాజకీయ పరిస్థితి దృష్ట్యా నిర్మోహమాటంగా ఆ వార్తను సరిచేయమనడం సుందరయ్య సున్నిత రాజకీయ దృక్పథానికి చిహ్నం. ఆయన అనారోగ్యంతో ఉన్నా అదే ఉత్తరంలో.. ఇక్కడ కామ్రేడ్స్ పరిస్థితి గురించి సవివరంగా తెలుపాల్సిందిగా రాయడం విశేషం.

సుందరయ్య క్రమశిక్షణను ఖచ్చితంగా పాటించేవారు. ఓసారి ప్రజాశక్తిలో పనిచేసేవారిలో అకస్మాత్తుగా నలుగురు సబెడిటర్లు జబ్బు పడ్డారు. ఆ సమయంలో బాధ్యతలు నిర్వహిస్తున్న బొమ్మారెడ్డి వద్దకు సుందరయ్య వచ్చి.. అస్వస్థత చెందిన సబెడిటర్లు తిరిగి పనిలోకి వచ్చేంతవరకూ రచయితలుగా ఉన్న నలుగురిని నేను పంపుతాను. అందుకు నీవు అంగీకారం తెలుపుతావా? అని అనుమతి కోరారు. నిజంగా ఆయన స్థానమేమిటీ, నా స్థానమేమిటీ అన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సంపాదక బాధ్యతలు నిర్వహిస్తున్న తన అంగీకారాన్ని కోరడం సుందరయ్య క్రమశిక్షణకూ, నమ్రతకూ ప్రబల నిదర్శనమని బొమ్మారెడ్డి తన స్వీయ గ్రంథం 'జ్ఞాపకాలు-అనుభవాలు'లో పేర్కొన్నారు. ◆

నాడు 'నందికొండ'..

నేడు 'వెలిగొండ' పేరుతో మోసం..

ప్రజాశక్తి-పొదిలి

ఒకటి కాదు, రెండు కాదు... ఏకంగా 75 వసంతాలు దాటినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది పొదిలి ప్రాంత అభివృద్ధి తీరు. 1970లో జిల్లాల పునర్విభజనకు ముందు పూర్వ నెల్లూరు జిల్లాలో ఉన్న ఈ ప్రాంతం అప్పటికి, ఇప్పటికీ అభివృద్ధిలో ఏమాత్రం మార్పు లేదంటే ప్రజలను పాలిస్తున్న ప్రభుత్వాలు, పాలకులు ఎక్కడ ఉన్నారో అర్ధమవుతుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పొదిలి కేంద్రంగా గతంలో తాలూకా వ్యవస్థ ఉండేది. దీని పరిధిలో ప్రస్తుతం పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాలు. ఆసమయంలో ఎలాంటి అభివృద్ధికి నోచలేదు. రాను రాను తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ముఖ్యంగా రైతాంగం పరిస్థితి మరింత దిగజారింది. ఈ పరిస్థితుల నుంచి గట్టేక్కేందుకు ప్రజలు వలస బాట పట్టారు. ఈ మూడు మండలాల పరిధిలోని వేలాది కుటుంబాలు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలస వెళ్తున్నారు. జిల్లా కేంద్రానికి పశ్చిమంగా ఉండే పొదిలితో పాటు కనిగిరి, పామూరు, నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి, దుత్తలూరు వంటి ప్రాంతాల అభివృద్ధి కోసం 1970-80 దశకంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా కుడి కాలువ ఏర్పాటు సమయంలో తీవ్రమైన అన్యాయం జరిగింది. ఈ కాలువను పొదిలి మీదుగా పై ప్రాంతాలకు తీసుకువెళ్లాలని భావించినా రాజకీయ విభేదాలతో పక్కదారి పట్టించారు. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డికి సన్నిహితులుగా ఉన్న రొండా నారపరెడ్డి ఈ కాలువను ఒంగోలుకు మళ్లించారు. అప్పట్లో ఆ ప్రాంత రైతులు తమ మాగాణి భూములకు నీటి సమస్య లేదని, కాలువ వద్దని ఫిర్యాదు చేసినా కాలువ మళ్లింపులో రాజకీయ కారణాలే కనిపిస్తాయి. ఆర్థిక సమస్య పేరుతో ఒకసారి, నీటి లభ్యత సరిపోదనే సాకుతో మరోసారి కుడి కాలువను

నదుల అనుసంధానంతోనే పొదిలికి మోక్షం

కురిచేడు వద్ద నుంచి మళ్లించి ఒంగోలుకు తరలించారు. ఈ సందర్భంగా తీవ్ర నిరసన ఉద్యమాలు చేసిన ఈ ప్రాంత ప్రజలను మభ్యపెట్టేందుకు సాగర్ కుడికాలు రెండో దశ పొడిగింపు ఉంటుందని హామీ ఇచ్చారు. అయినప్పటికీ దీన్ని ప్రజలు నమ్మలేదు. అదే సమయంలో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం మవుతుండటంతో దాని నుంచి ఈ ప్రాంతానికి సాగు, తాగు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అది ఆచరణ సాధ్యం కాదని తరువాత తేటతెల్లమైంది. కాలువ మళ్లింపు ప్రభావంతో అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి నర్సరావుపేట పార్లమెంటుకు పోటీ చేసి ఈ ప్రాంతానికి చెందిన మాజీ మంత్రి కాటూరి నారాయణస్వామిపై ఓడిపోయారు. తరువాత కుడికాలువ పొడిగింపు మరుగున పడింది. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారుతున్నా ఈ ప్రాంతంపై శీతకన్ను వేస్తూ ఎక్కడికక్కడ అభివృద్ధికి తూట్లు పొడుస్తూ కాలయాపన చేస్తూ సాగు, తాగు నీటి సమస్యను దాటవేస్తున్నారు.

తాజాగా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రతిపాదించిన నదుల అనుసంధానం నేడు ముందుకు వస్తోంది. గోదావరి-కావేరీ - పెన్నా నదుల అనుసంధానం ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలలో ఐదులక్షల ఎకరాలతో పాటు కడప, చిత్తూరు జిల్లాల్లో మరో ఐదు లక్షల ఏకరాల ఆయకట్టుకు నీరు అందించడం, ప్రస్తుత సాగర్ ఆయకట్టు పరిధిలోని మెట్ట ప్రాంతాల అవసరాలకు గోదావరి మిగులు జలాలలో 80 టిఎంసిల నీరు ఉపయోగించుకునేలా ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇందులో మన జిల్లాలోని పూర్వ సాగర్ కుడికాలువ ఆయకట్టు రెండవ దశలో ఈ ప్రాంతాలకు 50 టిఎంసిల వినియోగానికి ప్రతిపాదనలు ఉన్నాయి. గతంలో అన్యాయం జరిగి దశాబ్దాలు జరుగుతున్నా ప్రస్తుత ప్రతిపాదన ఎప్పటిలోపు ఆచరణ సాధ్యమవుతుందో అనేది ఎండమావిగానే ఉంది. గోదావరిపై పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా ఎగువన ఉన్న పులిచింతల ఎత్తిపోతల పథకానికి 320 టిఎంసిలు తరలిస్తారు. గోదావరి జలాలలను గుంటూరు జిల్లా బోల్లాపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణంతో నిల్వ చేసి సాగర్ ఆయకట్టుకు నీరు అందిస్తూనే వెలుగొండ రిజర్వాయర్‌కు మళ్లిస్తారు. అక్కడి నుంచి పశ్చిమ ప్రాంత ప్రజల నీటి అవసరాలు తీరుస్తూ మిగిలిన నీటిని పెన్నానదికి చేరుస్తారు. పెన్నా నుంచి సోమశిల ద్వారా తెలుగుగంగకు, గాలేరు - నగరి, హంద్రీ-నీవా సుజల స్రవంతికి తరలించి అంతిమంగా కావేరి నది చేరి తమిళ ప్రజలకు మంచినీరు ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. చూడటానికి బహుళార్ధ సాధక ప్రాజెక్టుగా అనిపిస్తున్న ఈ ప్రణాళికలో గతంలో ప్రభుత్వం ప్రతిపాదించిన సాగర్ కుడికాలువ రెండవ దశ కనిపించడం లేదు. దీంతో ఈ ప్రాంత నీటి సమస్యపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది.

జాతీయ పతాక నిర్మాత పింగళి

జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య ఆగస్టు 2, 1878న దివి తాలూకా భట్లపెనుమర్రు గ్రామంలో జన్మించారు. ఆయన బాల్యం, విద్యాభ్యాసం ఇక్కడే కొనసాగింది. 12 సంవత్సరాలకే సెకండరీ విద్య పూర్తిచేసి 19 సంవత్సరాల ప్రాయంలోనే యుద్ధంలో చేరాలనే కోరికతో ముంబై వెళ్ళి సైన్యంలో చేరి ఆఫ్రికాకు వెళ్లారు. అక్కడ గాంధీజీని కలవటం, స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితుడు కావడంతో ఇండియాకు తిరిగి వచ్చారు. అప్పటికే మద్రాసులో ప్లేగు వ్యాధి ప్రబలి ఉండటంతో దేశ ప్రజలను ఆ వ్యాధి నుంచి కాపాడాలన్న తపనతో వ్యాధి నివారణ అధికారిగా పనిచేశారు. 1904లో రష్యాను జపాన్ గెలిచిందన్న వార్త విని వెంకయ్యలోని జిజ్ఞాస మేల్కొని ఇది ఎలా సంభవం, పెద్ద దేశాన్ని ఇంత చిన్నదేశం ఎలా జయించింది అనే తపనతో జపాన్ భాష నేర్చుకుని అనర్గళంగా మాట్లాడారు. జపాన్ వెంకయ్య అని పేరు పెట్టారు ప్రజలు. ఆయనకు ఆ భాష నేర్పిన గురువుకు మన భాషను నేర్పి గురు రుణం తీర్చుకున్నారట వెంకయ్య, వారి పట్టుదల ఎంత దృఢమైనదో యువత గుర్తుంచుకోవాలి. దేశభక్తిగల వెంకయ్య 1906లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభల్లో పాల్గొని నాటి సభాధ్యక్షులైన దాదాబాయి నౌరోజి మన్ననలు పొంది నిర్ణయ సభ సభ్యునిగా గుర్తింపు పొందారు. వ్యవసాయంపై ఆసక్తితో పరిశోధనలు చేసి వ్యవసాయ శాస్త్రం అనే గ్రంథాన్ని ప్రజలకు అందించారు. వారి మేథా సంపత్తి నుంచి మనం ఎంతైనా నేర్చుకోవాల్సివుంది. అందుకే ఆయనను రాజకీయ ద్రష్టగా అభివర్ణించారు పెద్దలు. 1906లో కోల్‌కొతాలో జరిగిన కాంగ్రెస్ సభల్లో ఇంగ్లీషు వారిని పొమ్మంటూనే వారి జెండాను ఉపయోగించటం నచ్చని వెంకయ్య మనకంటూ ఒక జెండా కావాలనే తపనతో భారతదేశ జాతీయ పతాకం అనే గ్రంథాన్ని 1916లో మనకు అందించారు. అప్పుడు వారిని జెండా వెంకయ్యగా పిలిచేవారు. ఇలా చెప్పుకుంటూ పోతే వారి జీవిత విశేషాలు ఎన్నో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి.

1921 మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీన బెజవాడలోని గాంధీనగర్‌లో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ మహాసభల్లో శాంతి సౌభాగ్యాలకు చిహ్నంగా మూడు రంగులతో గాంధీజీ సమక్షంలో వెంకయ్య రూపొందించిన జెండాను ఏకగ్రీవంగా కరతాళ ధ్వనుల మధ్య ఆమోదించబడి మొదట రాట్నం ఉన్న, తర్వాత పెద్దలు ధర్మానికి గుర్తుగా అశోకచక్రంతో మన జాతీయ జెండా కీర్తి అనే ఆకాశంలో విహరిస్తూ భారతదేశం మనది అనే స్ఫూర్తిని గర్వంగా చాటుతూ రెపరెపలాడుతోంది.

ప్రతి అక్షరం..ప్రజల పక్షం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా టాబ్లాయిడ్ తెచ్చి ప్రధాన పత్రికల సరసన నిలిచింది. అదే క్రమంలో పత్రిక విస్తరణ పెరిగింది. సర్క్యులేషన్ మరింత పెరిగింది. పత్రిక కలర్‌లోకి రావడం కూడా ఇదే కాలంలో జరిగింది. ఇక్కడే ప్రచురణ కేంద్రం ఏర్పాటు చేయాలనే ఆలోచన 2005 నుంచే మొదలైంది. అప్పటి నుంచీ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగడం జరిగింది. అయితే 2013లో ఒంగోలు ఎడిషన్ ఆరంభమైంది. అప్పటి మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు ఈ ప్రచురణ కేంద్ర ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ప్రజాశక్తి ఎదుగుదలను కీర్తించారు. ప్రజల పక్షాన నిలబడటంతోనే ప్రజాశక్తి ఈ స్థాయికి చేరిందని శ్లాకించారు. ప్రజాశక్తి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 8 పేజీల మెయిన్, 16 పేజీల టాబ్లాయిడ్‌తో నడిచింది. కరోనా తర్వాత అన్ని ప్రధాన పత్రికలు పేజీల సంఖ్యను కుదించిన విషయం తెలిసిందే. ప్రజాశక్తి మళ్లీ అతితక్కువ సమయంలోనే టాబ్లాయిడ్‌ను పునరుద్ధరించి.. ప్రస్తుతం ప్రకాశం, బాపట్ల జిల్లాలకు మెయిన్ 8, టాబ్లాయిడ్ పేజీలతో ముందుకు సాగుతోంది. ఇప్పుడు జాతీయ రహదారిలో నూతనంగా నిర్మించిన సొంతభవనంలో ప్రజాశక్తి ప్రచురణ కేంద్రం కొనసాగుతోంది. ప్రకాశం, బాపట్ల జిల్లాలకు ఒంగోలు నుంచే ప్రచురణ చేసి.. రెండు జిల్లాల చివరి ప్రాంతాలకు, మండలాలకు సొంత ట్రాన్స్‌పోర్టుతో వేకువజామునే పాఠకులకు పత్రికను అందిస్తోంది.

అనేక ప్రత్యేక సంచికలు..

జిల్లాలో వివిధ రంగాలపై ప్రజాశక్తి అనేక ప్రత్యేక సంచికలు ప్రచురించింది. 1996 కాలంలో పంచాయతీలపై ప్రత్యేక సంచిక వెలువడింది. 2000 సంవత్సరంలో మిలీనియం సంచిక పేరుతో పెద్ద పుస్తకం ప్రచురించడం జరిగింది. అందులో అనేక రంగాల్లో జరుగుతున్న పరిణామాలు, అభివృద్ధిని ప్రముఖులు విశ్లేషించడం జరిగింది. విద్యా, వైద్య రంగాలపై సంచికలు వస్తూనే ఉన్నాయి. ప్రత్యామ్నాయ విధానాలను సూచించడం జరిగింది. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అనేక సంచికలు వేయడం జరిగింది. నియోజకవర్గాల అభివృద్ధిపైనా సంచికలు వచ్చాయి. జిల్లాలో సేవాదృక్పథంలో నడిచే ప్రముఖులకు కొన్ని సంచికలు వేసి.. వారిని ప్రోత్సహించడం జరిగింది. అదే స్థాయిలో వారి నుంచి కూడా ప్రజాశక్తికి ఆదరణ లభించింది. ఆయా సంచికలు, ఆవిష్కరణల సందర్భంగా చర్చావేదికలు నిర్వహించింది. వివిధ రంగాల ప్రముఖులను ఆహ్వానించి ఆయా రంగాలపై వారి అభిప్రాయాలను ప్రజల ముందుంచింది. ప్రతి రంగంలోనూ ప్రజాకోణం ఏమిటనేది విశ్లేషించి దానికే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. పాలకుల విధానాల వల్ల జరిగే లాభనష్టాలను విశ్లేషించి సమాచారం ఇవ్వడం.. ప్రజలపై మోపే భారాలను ఎప్పటికప్పుడు చెప్పడం కీలకంగా సాగింది. బ్యాంకులు, ఎల్ఐసీ, టెలికం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పోరాటాలకు సంఘీబావంగా వారి సమస్యలు వెలుగులోకి తేవడంతో పాటు సమ్మెల్లో ప్రత్యేక సంచికలూ తేవడం జరిగింది. అవి వారికి దిక్సూచిగా నిలిచాయి.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకెళుతున్నాం. అదే సమయంలో ప్రభుత్వ విధానాల్లో లోపాలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నాం.

జిల్లా విభజన తర్వాత..

ఏడాది క్రితం జరిగిన జిల్లా విభజన తర్వాత పత్రికలో మార్పులు తప్పలేదు. ఉమ్మడి ప్రకాశం మూడు ముక్కలైంది. ప్రకాశం, బాపట్ల జిల్లాలను కలిపి ఒక యూనిట్‌గా తీసుకుని టాబ్లాయిడ్ తీసుకురావడం జరిగింది. భవిష్యత్‌లో జిల్లాల వారీగా టాబ్లాయిడ్‌ను తీసుకురావాలనేది లక్ష్యం. అందుకు అన్ని వర్గాల ఆదరణే కీలకంగా భావిస్తున్నారు. పత్రికకు ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు, వివిధ రంగాల ఉన్నతాధికారుల నుంచి ఆదరణ లభిస్తోంది. ఇది మరింత పెరగాలని ఆకాంక్షిస్తున్నాం. ఉద్యోగ, కార్మిక, పీడిత, తాడిత ప్రజల పక్షాన నిలబడే ఏకైక పత్రికగా ప్రజాశక్తి ముందుంది. కొత్తల జిల్లాల్లో జరిగే అభివృద్ధిపైనా చర్చావేదికలకు పిలుపునిచ్చింది. జిల్లా విభజన హేతబద్ధంగా లేదని అన్ని పార్టీలు, సంఘాలు, ప్రజాప్రతినిధుల గొంతుకు ప్రజాశక్తి కూడా సంఘీభావంగా నిలబడింది. జిల్లాలు హేతుబద్ధంగా జరగాలని సూచించింది. అన్నివర్గాల అభిప్రాయాలను పత్రికలో ప్రచురించడం కూడా జరిగింది.

సమిష్టి కృషితో ప్రజాశక్తి అభివృద్ధి

ప్రజాశక్తి ఎదుగుదలకు సంస్థ విలేకరులు, సిబ్బంది, నాయకత్వ సమిష్టి కృషే కారణం. ప్రజాశక్తి అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రజలు సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తున్నారు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం సందర్భంగా వీరందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.



పత్రికలపై కేంద్రం దాడి

కేంద్రప్రభుత్వం వార్తా పత్రికలు, మేగజైన్లకు ఉపయోగించే న్యూస్ ప్రింట్ దిగు మతిపై 10 శాతం కస్టమ్స్ సుంకాన్ని పెంచడం దురదృష్టకరం. ఇప్పటికే నిర్వహణ వ్యయం పెరిగి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పత్రికలకు ముఖ్యంగా చిన్న పత్రికలకు ప్రభుత్వ నిర్ణయం తలకు మించిన భారంగా మారుతోంది. కస్ట మ్స్ సుంకాన్ని ఒక్కసారిగా పదిశాతం పెంచ డం పత్రికలపై ప్రభుత్వదాడిగా పరిగణించాలి. ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం బాగా తగ్గిపోయి పత్రికలు ఆర్థికంగా దెబ్బతింటు న్నాయి. డిజిటల్ మీడియా బాగా విస్తరించడం తో పత్రికల్లో ప్రకటనలు తగ్గిపోయాయి. పెద్ద పత్రికల్లో చాలా భాగం ప్రభుత్వకనుసన్నల్లోనే వుంటున్నాయి. మీడియా సంస్థలు క్రమంగా గుత్త పెట్టుబడిదారుల చేతుల్లోకి పోతున్నాయి. ప్రభుత్వాల నుంచి ఇతరత్రా పెద్దఎత్తున రాయితీలు పొందుతున్న బడా పారిశ్రామిక వేత్తలు వారి ఆధీనంలోని మీడియా సంస్థల్లో వచ్చే లాభనష్టాలను లెక్క చేయరు. ప్రభుత్వం ప్రకటనల రూపంలోనూ ఇతరత్రా రాయితీల ద్వారా వారికి సహాయపడుతూనే వుంది. ఎటొచ్చీ మీడియం, చిన్న పత్రికల నిర్వహణే ప్రమాదంలో పడుతుంది. అధికారంలో వున్నవారు తమ అభిప్రాయాలు, ఆలోచనలు తప్ప మరొక ఆలోచన ప్రజల్లోకి వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. న్యూస్ ప్రింట్‌పై అదనపు పన్నులు విధించడం వల్ల పాలకుల పట్ల విమర్శనాత్మకంగా వ్యవహరించే పత్రికలను అదుపు చెయ్యడానికి ప్రభుత్వం పూనుకొంది. ఏటా దేశంలో ఉత్పత్తి అయ్యే న్యూస్‌ప్రింట్ పది లక్షల టన్నులు మాత్రమే. దేశంలోని వార్తా పత్రికలు, మేగ-జైన్లకు ఏటా 25 లక్షల టన్నుల న్యూస్‌ప్రింట్ అవసరం. అందుకని న్యూస్‌ప్రింట్ అవసరాల కోసం ఖచ్చితంగా దిగుమతులపై ఆధారపడాల్సిందే.

తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్న కొన్ని పత్రికలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటనలను నిలిపివేసింది. ఇలాంటి పరిస్థితుల్లో న్యూస్ ప్రింట్‌పై అదనపు పన్ను విధించడం వెనుకవున్న ప్రభుత్వ లక్ష్యం స్పష్టంగా అర్థమవుతోంది. ప్రజాసమస్యలను, పక్కకునెట్టి తమకు అనుకూల వార్తలను మాత్రమే ప్రజలకు చేరేలా చేయడానికే ప్రభు త్వం పత్రికలపై ఇలాంటి దాడికి పూనుకొంది. పత్రికా స్వేచ్ఛను, సమాచారం తెలుసుకొనేం దుకు ప్రజలకున్న హక్కును కాపాడాలనుకొనే వారెవ్వరూ ఇలాంటి విధానాలను సమర్థించజాలరు. ఇలా పత్రికలను అదుపుచేయాలనుకోవడం పత్రికా స్వేచ్ఛపై దాడిగానే భావించాలి. కేంద్రప్రభుత్వం మరో వైపున వర్కింగ్ జర్నలిస్టుల, మొత్తం కార్మికవర్గం హక్కులను హరించేందుకు ప్రయత్నిస్తోంది. 44 కార్మికచట్టాల స్థానే నాలుగు కోడ్‌లను ప్రవేశపెట్టాలనే ప్రయత్నం చేస్తున్నది. దేశవ్యాప్తంగా కార్మికుల, ఉద్యోగుల, జర్నలిస్టుల, పత్రికల్లో పనిచేసే ఇతర సిబ్బంది హక్కులు కాపాడుకొనేందుకు జరుగుతున్న పోరాటంలో మన వంతు పాత్రను నిర్వహించాల్సిన అవసరం ఉంది.